
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

గురువారం 5 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా) 5-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	39	29
నరసరావుపేట	39	26
బాపట్ల	39	29
రెంటచింతల	39	28
చీరాల	39	29



యోగాతో శారీరక దృఢత్వం


యోగాంధ్రలో ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, మేయర్, కమిషనర్, ఇన్‌చార్జి కలెక్టర్ తదితరులు



గుంటూరు(కార్పొరేషన్), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాతో శరీరానికి సమతుల్యతో పాటు దృఢత్వాన్ని అందుతుందని ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ తెలిపారు. యోగాంధ్రలో భాగంగా బుధవారం ఉదయం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఎదురు యోగా రోడ్డులో యోగాసనాల శిక్షణ, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా, వ్యాయామం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రతి ఒక్కరు యోగాను జీవన విధానంలో భాగం చేసుకోవాలన్నారు. నటరాజ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ విద్యా సంస్థల విద్యార్థులు నృత్య రూపకంలో యోగాసనాలు ప్రదర్శన ఆకట్టుకుంది. ఇన్‌చార్జి కలెక్టర్, ఎమ్మెల్యేతో పాటు మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఆయుష్ జిల్లా అధికారి అనిత, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీపీవో సాయికుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డ్వామా పీడీ శంకర్, హౌసింగ్ పీడీ ప్రసాదు, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీలా, ఏసీ ఓబులేసు, డీసీలు డీ శ్రీనివాస్, బీ శ్రీనివాస్, వెంకటకృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



సాగర్‌లో నీటి నిల్వ

జల.. జలాశయాలు

- రుతుపవనాల విస్తరణతో వర్షాలు
- కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద ప్రవాహం
- ప్రాజెక్టుల్లో ఆశాజనకంగా నీటి నిల్వలు
- గత ఏడాది కంటే 80.02 టీఎంసీలు అధికం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రుతు పవనాలు విస్తరణతో కృష్ణానది పరివాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆల్మట్టి, తుంగభద్ర, జూరాల ప్రాజెక్టులకు వరద ప్రవాహం పోటెత్తుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జూన్ ప్రారంభంలోనే జలాశయాలకు నీటి ప్రవాహం వస్తోంది. ఆల్మట్టి నుంచి శ్రీశైలం ఎగువ ప్రాజెక్టుల వరకు పూర్తిస్థాయి నీటి నిల్వ 271.83 టీఎంసీలు కాగా ప్రస్తుతం 107.55 నిల్వ ఉంది. ఆల్మట్టికి 17.760, తుంగభద్రకు 8,222, జూరాలకు 18,867, శ్రీశైలానికి 17,759, సాగర్‌కు 4,377 కూసెక్కుల వరద ప్రవాహం ఉంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో ఈ నెలాఖరుకు ప్రాజెక్టుల్లోకి సమృద్ధిగా వరద నీరు వస్తుందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది జూలై నెలాఖరు కల్లా శ్రీశైలం ఎగువ ప్రాజెక్టులు నిండాయి. అదే పరిస్థితులు ఈ ఏడాది నెలకొంటాయని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. మొత్తంమీద సాగర్ ఆయకట్టులో ఈ ఏడాది కూడా సాగుకు నీరు వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నిల్వ	గతేడాది నిల్వ	ప్రస్తుత నిల్వ
ఆల్మట్టి	123.08	22.37	54.23
నారాయణపూర్	33.31	19.30	24.45
జూరాల	9.66	3.75	8.43
తుంగభద్ర	105.78	3.37	20.44
శ్రీశైలం	215.81	32.29	53.75
నాగార్జున సాగర్	312.05	122.69	134.75

రేపటి నుంచి మెగా డీఎస్సీ

- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఉమ్మడి జిల్లాలో 14 కేంద్రాలు ఏర్పాటు

గుంటూరు(విద్య), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి నిర్దేశించిన సబ్జెక్టుల వారీగా ఆన్‌లైన్‌లో పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 14 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో రేణుక తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ నెల 30 వరకు విడతల వారీగా పరీక్షలు జరగనున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పాటు అభ్యర్థుల కోసం హెల్ప్‌లైన్ డెస్కులు, కేంద్రాల వద్ద డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు నిర్దేశించిన సమయాల్లో పరీక్షా కేంద్రాలకు రావాలని, ఒక్క నిమిషం ఆలస్యమైన కేంద్రాల్లోకి అనుమతించమని డీఈవో స్పష్టం చేశారు.

ఆర్టీఈ అడ్మిషన్లు.. 1,689

- విద్యా హక్కు చట్టంలో విద్యార్థుల ఎంపిక
- 7 కల్లా ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రవేశాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యా హక్కు చట్టాన్ని(ఆర్టీఈ) కఠినంగా అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. విద్యా హక్కు చట్టాన్ని వైసీపీ నిర్వీర్యం చేయగా కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి అమలు చేస్తోంది. ఒకటో తరగతిలో చేరే పేదల నుంచి దరఖాస్తులను స్వీకరించి లాటరీ పద్ధతిలో విద్యార్థులను విద్యాశాఖ ఎంపిక చేసింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 1,689 విద్యార్థులు ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లకు ఆమోదం తెలిపింది. ఎంపికలో అనాథ పిల్లలు, దివ్యాంగులు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, అగ్రకులాల్లో పేదలకు ప్రాధాన్యం ఇచ్చింది. గుంటూరు జిల్లాకు సంబంధించి 1,149, పల్నాడులో 298, బాపట్ల జిల్లాలో 242 విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యాశాఖ అధికారులు సమాచారం అందించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులు అడ్మిషన్లు ఈ నెల 7 తేదీ కల్లా పొందాలని సదరు అధికారులు సూచిస్తున్నారు. విద్యా హక్కు చట్టం అమలుకు శ్రీకారం చుట్టి పేదలకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందిస్తుండటంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టం ప్రకారం 1 నుంచి 8వ తరగతి వరకు ఉచితంగా ఆయా విద్యా సంస్థల్లో విద్యను వారు కొనసాగించవచ్చు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజును చెల్లించనున్నది.

రీ సర్వేకు.. చిక్కులు

- కొలిక్కిరాని తొలిదశ.. రెండో విడత ప్రారంభం
- సాంకేతిక సమస్యలతో పనిచేయని రోవర్స్
- సరిపడా సిబ్బంది లేక నత్తనడకన రీ సర్వే
- ముంచుకొస్తున్న గడువు.. 30 శాతమే పూర్తి

ఐదేళ్ల వైసీపీ పాలన వేల సంఖ్యలో భూ సమస్య లను మిగిల్చగా.. వీటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సమ గ్ర రీసర్వే కు శ్రీకారం చుట్టింది. అయితే ఈ కార్యక్రమానికి రక రకాల చిక్కులు ప్రతిబంధకంగా మారాయి. పైగా తొలి విడత రీ సర్వే జరుగుతుండగా.. అది ఒక కొలిక్కి రాకుండానే రెండో విడత ప్రారంభించింది. రెండో విడతకు గడువు ఈ నెల 6న విధించింది. అయితే సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత, అందుబాటులో లేని రైతులు తదితర చిక్కులతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ఇప్పటికి 30 శాతం కూడా రీ సర్వే పూర్తి కాలేదు. తొలి దశ రీ సర్వేను పూర్తి చేయడానికి ఈ ఏడాది ఫిబ్రవరిని తుది గడువుగా ప్రభుత్వం నిర్దేశించింది. కానీ అది కొలిక్కి రాక ముందే రెండో దశ ప్రారంభించడంతో మొత్తం ప్రక్రియే ప్రహసనాన్ని తలపించే రీతిలో సాగుతుంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

భూ సమస్యలను పరిష్కరించి, భూ యజమానులకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో సమగ్ర రీసర్వేకు శ్రీకారం చుట్టింది. తొలి దశ లో మండలానికో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని గతే డాది చివరిలో భూముల ప్రక్షాళనకు ప్రభుత్వం సమాయత్తమైంది. సమగ్ర రీ సర్వేకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో రీసర్వే ముందుకు మూడడుగులు.. వెనక్కి ఏడడుగులు అన్న చందాన తయారైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరకొర సౌకర్యాలు కల్పించి రీ సర్వే ప్రక్రియను గడువులోగా పూర్తి చేయమనే ఆదేశాలు ప్రభుత్వం వైపు నుంచి (మిగతా 6వ పేజీలో)

మొదటి దశకు మరో వారం..

మొదటి విడతలో బాపట్ల జిల్లాలో 62,288 ఎకరాలకు సర్వే పూర్తి చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు 1.10 లక్షల ఎకరాలుగా ఉంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఇంకా 13ఏ నోటీసులు జారీ చేయడం వరకే వచ్చింది. కాగా తుది జాబితా ఆర్ వోఆర్ ప్రచురణకు మరో వారం రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



వేమూరు : కుచ్చెళ్లపాడు గ్రామంలో రీ సర్వే చేస్తున్న సిబ్బంది (పాత చిత్రం)



ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు

వెబ్ ఆప్షన్స్.. వెతలు

ఒక్కొక్కరికి గంటన్నర సమయం

- స్కూల్ అసిస్టెంట్ల బదిలీల్లో ఎడతెగని సమస్యలు
- నేటితో ముగియనున్న గడువు.. సమయం పెంచాలని విజ్ఞప్తులు

గుంటూరు (విద్య) జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల సమస్యలు రోజుకు జటిలం అవుతున్నాయి. తప్పనిసరిగా(కంపల్సరీ) బదిలీ కావాల్సిన వారు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకునేందుకు ఒక్కో ఉపాధ్యాయుడికి గంట నుంచి 1.30 గంటల వరకు సమయం పడుతున్నది. ఆయా సమస్యలపై ఇప్పటికే విజ్ఞప్తులు చేసినా పరిష్కారం కావడం లేదని ఉపాధ్యాయ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ వెబ్ ఆప్షన్స్‌కు గురువారంతో గడువు ముగియనున్నది. ఈ పరిస్థితుల్లో గడువు పెంచాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. పా యింట్స్ సమానమైనప్పుడు సీనియారిటీ ప్రకారం కాకుండా పుట్టిన తేదీ తీసుకోవడం జీవో 22కు విరుద్ధమంటున్నారు. ప్రిఫరెన్సియల్ కేటగిరిలో రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నవారి ప్లేస్ అరైజింగ్ ఉన్నచోట ఖాళీగా కనిపించడంలేదంటున్నారు. డీఈవో కార్యాలయం విడుదల చేసిన ఖాళీలకు వెబ్ ఆప్షన్స్‌కు ఆన్‌లైన్‌లో ఉన్న ఖాళీలతో వ్యత్యాసం ఉందని ఉపాధ్యాయ సంఘాలు వెల్లడిస్తున్నాయి.

నేడు ఎస్‌జీటీలకు సర్టిఫికెట్ల పరిశీలన

మున్సిపల్, కార్పొరేషన్, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేసే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల జాబితాను డీఈవోజీఎస్‌టీబ్లాగ్‌స్పాట్ అనే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో రేణుక తెలిపారు. సంబంధిత సబ్జెక్టు, మీడియానికి సంబంధించి కార్పొరేషన్‌లో 162, మున్సిపాలిటీలో 40 పోస్టులు ఉన్నాయన్నారు. ఉద్యోగో న్నతుల అర్హతగల ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు రావాలని సూచించారు. ప్రభుత్వ యాజమాన్యంలో 50 పోస్టులు, జిల్లా పరిషత్ యాజమాన్యంలో 83 పోస్టులకు అర్హులై సర్టిఫికెట్ల పరిశీలన మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

నేడు రాజధానిలో వనమహోత్సవం

- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

8


వెంటాడుతున్న.. ప్లాస్టిక్ భూతం

- చర్యలు తీసుకొంటున్నా వదలని ప్లాస్టిక్
- మానవ శరీరాల్లోకి చొచ్చుకొస్తున్న సూక్ష్మ ప్లాస్టిక్ పదార్థాలు
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

అమరావతి కేంద్రంగా.. క్వాంటం వ్యాలీ

- రాజధానిలో ఉపాధి అవకాశాలు కోకొల్లలు
- సీఆర్‌డీఏలో 50 ఎకరాల కేటాయింపునకు ఆమోదం

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీని ప్రమోట్ చేసి హైదరాబాద్‌ని దేశంలోనే ముఖ్యమైన నగరంగా సీఎం చంద్రబాబు చేశారో అంతకుమించి అమరావతిని మార్చేందుకు ప్రణాళికని రూపొందించారు. ఇందులో భాగంగానే కంప్యూటింగ్‌లో అడ్వాన్స్ అయిన క్వాంటమ్ విధానాన్ని అమరావతిలో ప్రమోట్ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 50 ఎకరాల భూమిని ఏపీసీఆర్‌డీఏ (మిగతా 6వ పేజీలో)



క్వాంటం వ్యాలీ టెక్ పార్కు నమూనా

ఆంధ్రజ్యోతి అక్షరమే అండగా.. అభివృద్ధి



గాయత్రీ నగర్‌లో రూ.45 లక్షలతో పూర్తయిన సీసీరోడ్డు



కొట్నాస బజార్‌లో జరుగుతున్న పనులు

వినుకొండలో ముమ్మరంగా పనులపై హర్షం

వినుకొండటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి అక్షరమే అండగా-పరిష్కారమే అజెండాగా కార్యక్రమం ద్వారా పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జనవరి 28న చేపట్టిన కార్యక్రమంలో స్థానిక గాయత్రినగర్, కోట్నాసబజార్‌లో మాజీ సర్పంచి పఠాన్ ఖాసిమ్‌ఖాన్ వీధిలోని సమస్యలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు 2025 మార్చి 25న సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాల్వ పనులకు శంకు స్థాపన చేశారు. మూడు నెలల్లో గాయత్రీనగర్‌లో సుమారు రూ.45లక్షల తో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. కోట్నాస బ జార్‌లో రూ.17 లక్షలతో సీసీ రోడ్డుతో పాటు, డ్రెయినేజీ కాల్వ ప నులు శరవేగం గా జరుగుతున్నాయి. గతంలో మురుగునీటితో రాకపోకలకు స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతుండేవారు. ఆంధ్రజ్యోతి చేప ట్టిన కార్యక్రమం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులతో మురుగు ముప్పు తప్పిందని ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రీ సర్వేకు.. చిక్కులు

(5వ పేజీ తరువాయి)

రావడాన్ని ఉద్యోగులు తప్పుబడుతున్నారు. సిబ్బంది కొరత మూడు జిల్లాల్లో ఉన్నప్పటికీ కొత్త జిల్లాలైన బాపట్ల, పల్నాడు జిల్లాలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. దీంతో రీ సర్వే ఆశించినంత వేగంగా సాగడం లేదు. హద్దులు నిర్ణయించడానికి ఉపయోగించే రోవర్స్‌లో దాదాపు సగం సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదు. రోవర్స్‌ను బాపట్ల జిల్లాకు 119 కేటాయిస్తే 68 మాత్రమే పనిచేస్తున్నాయి. సాంకేతిక సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఉద్యోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే పని చేయని రోవర్స్ సంఖ్య వంద వరకు ఉండొచ్చని తెలుస్తోంది. రీ సర్వేలో సర్వే విభాగంతో పాటు రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొనాలి. అయితే రెవెన్యూలో అన్ని విభాగాల్లో కలిపి మూడు జిల్లాల పరిధిలో 320 వరకు ఖాళీలు ఉన్నట్లు సమాచారం. రీ సర్వే కార్యాలయాల్లోనూ ఖాళీలుండడం గమనార్హం. గత ప్రభుత్వం తప్పిదాలపై గ్రామసభల్లో వచ్చిన అర్జీల సంఖ్య ఒక్క బాపట్ల జిల్లాలోనే 5,900 వరకు ఉండగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య 14,000కు పైనే ఉంది. వీటి పరిష్కారం యంత్రాంగానికి తలకు మించిన భారంగా మారడంతో రీ సర్వేలో వేగం మందగించింది. రెండో దశ రీ సర్వే అంకాన్ని పూర్తి చేయడానికి ఈ నెల 6న గడువుగా ప్రభుత్వం విధించింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే ఇప్పటి వరకు 30 శాతం కూడా రీ సర్వే పనులు పూర్తి కాలేదు. రెండో దశలో బాపట్ల జిల్లాలో 79,000 ఎకరాలకు ఇప్పటి వరకు కేవలం 26,000 ఎకరాల్లోనే పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

అమరావతి కేంద్రంగా.. క్వాంటం వ్యాలీ

(5వ పేజీ తరువాయి)

కేటాయించగా దానిని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. దీంతో త్వరలోనే క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు కానుంది. క్వాంటం కంప్యూటింగ్ అనేది ఎంతో అడ్వాన్స్ టెక్నాలజీ. క్వాంటం కంప్యూటర్లు సంప్రదాయ కంప్యూటర్ల కంటే శక్తిమంతంగా గణన చేస్తాయి, కొత్త ఔషధాల అభివృద్ధి, నమూనా రూపొందించడంలో సహకరిస్తాయి. ప్రస్తుతం పరిశోధన, అభివృద్ధి దశలో ఉండగా భవిష్యత్తులో కీలకం కానుండటంతో దానిని అందిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు క్వాంటం వ్యాలీని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అమరావతిలో ఏర్పాటు చేయబోయే క్వాంటం వ్యాలీ అడ్వాన్స్ రీసెర్చ్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలపై ఐఐటీ మద్రాసు, టీసీఎస్, ఐబీఎంతో కలిసి పని చేస్తుంది. తద్వారా అంతర్జాతీయ స్థాయి పరిశోధకులను అనువైన వేదికగా అమరావతి నిలుస్తుంది. అలానే దేశ, విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఇప్పటికే క్వాంటం వ్యాలీకి సంబంధించిన డీపీఆర్‌ని రూపొందించి నివేదించారు. ఎల్అండ్‌టీ సంస్థ క్వాంటం వ్యాలీ టెక్ పార్కు అభివృద్ధి చేస్తుంది. ఈ నెలలో సదస్సుని అంతర్జాతీయ నిపుణులతో కలిసి నిర్వహించి అభివృద్ధి వ్యూహాత్మక ప్రణాళికలను సిద్ధం చేయనున్నారు.

నంబరు ప్లేట్‌లపై ప్రత్యేక దాడులు

ఎఫెక్ట్

గుంటూరు(తూర్పు), జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక, గుంటూరు జిల్లా సంచిక నందు ప్రచురించిన "ప్లేట్ ఫిరాయిస్తున్నారు..." అనే శీర్షికపై రవాణాశాఖ అధికారులు స్పందించారు. గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌లపై బుధవారం ప్రత్యేక దాడులు చేపట్టారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించారు. తనిఖీల్లో 573 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ. 86,400 జరిమానాలు విధించినట్టు ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

సొంతవారిని వెన్నుపోటు పొడిచింది జగనే

● రాక్షసపాలన అంతమై ఏడాది ● మంత్రి అనగాని



యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని అనగానికి అందిస్తున్న మంత్రి లోకేశ్

రేపల్లె, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నాటిరాక్షసపాలనపై ప్రజలను చైతన్యవంతం చెయ్యటంలో యువగళం పాదయాత్ర సఫలీకృతమయిందని, రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని మంత్రి అనగానికి మంత్రి లోకేశ్ అందించారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ ఆనాటి అనుభవాలను కళ్ళకు కట్టినట్లుగా పుస్తకరూపంలో తీసుకురావటాన్ని ఆయన ప్రశంసించారు. ఈరోజుకు అరాచకపాలన అంతమై ఏడాది పూర్తయ్యిందని గత ప్రభుత్వ పాలన పీడకలను ఇప్పటికి జనం మరిచిపోలేరన్నారు. ప్రజల్లో ఉనికి కోల్పోతున్నామని జగన్‌రెడ్డి కుటిల రాజకీయాలకోసం వెన్నుపోటు దినోత్సవం అంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సొంత చెల్లికి, తల్లికి వెన్నుపోటు పొడిచిన జగన్‌రెడ్డి చేసిన వెన్నుపోట్లు ఎన్నో ఉన్నాయన్నారు. గుండెపోటు అంటూ బాబాయ్‌ను గొడ్డలిపోటుకు గురిచేసి చిన్నాన్ననే వెన్నుపోటుపొడిచిన మనస్తత్వం జగన్‌దేనన్నారు.

ఆదర్శ రాజకీయవేత్త రెడ్డమ్మ చౌదరి

● సుదీర్ఘ కాలం జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా సేవలు ● నేడు శత జయంతి



రెడ్డమ్మ చౌదరి

తెనాలి అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత వ్యక్తిత్వం, ఆదర్శ రాజకీయం ఈ రెండిండికి పరస్పరం వ్యతిరేకం. మంచి మనసులు కలిగిన వారు రాజకీయాల్లో ఇమడటం కష్టమంటారు. అందుకు భిన్నంగా రాజకీయాల్లో ఉంటూ ప్రజా సేవ చేసి ఆదర్శంగా నిలిచి ప్రశంసలు అందుకున్న వారు అరుదుగా కనిపిస్తారు. ఈ కోవకు చెందిన వారుగా తెనాలికి చెందిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి. రాజకీయ నేతగా జీవిత కాలం నిబద్ధతతో పని చేసి రాజకీయాల నుంచి స్వచ్ఛందంగా వైదొలగారు. నిరుద్యోగులు, పేద విద్యార్థులు, క్రీడాకారులకు ఆర్థిక సాయం చేశారు. విద్యాసంస్థలు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు తోడ్పాటు ఇచ్చారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో 1925 జూన్ 5న ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. బ్రిటీష్ ప్రభుత్వంలో జ్యూరీగా పని చేసిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి మనువడే ఈయన. తాత పేరిటే నామకరణం చేశారు. తండ్రి వల్లభరావు 20 గ్రామాల ప్రజలకు తలలో నాలుకగా ఉండేవారు. ఆయన పెద్ద తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు తామ్రపత్ర గ్రహీత సూర్యనారాయణ. స్వరాజ్యం కోసం ఏడేళ్లు కారాగార జీవనం చేశారు. తాత, పెద్ద నాన్న స్ఫూర్తితో చిన్ననాటి నుంచే ఆదర్శ భావాలు మొగ్గ తొడిగాయి. ఎస్ఎల్‌సి తరువాత రాజకీయ రంగం వైపు అడుగులు వేసిన ఆయన 1962లో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ అయ్యారు. రెండుసార్లు పదవిలో కొనసాగిన ఆయన రైతు సేవలో సంస్కరణలు ప్రవేశ పెట్టారు. రుణాలను చెక్కుల రూపంలో ఇచ్చే విధానాన్ని తెచ్చారు. పార్టీలకు అతీతంగా పని చేసి రైతుల మన్ననలు పొందారు. రాజకీయాల స్వరూపం మారడాన్ని గ్రహించి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. జేఎంజే మహిళ కళాశాల స్థాపనకు కృషి చేయడమే కాకుండా భారీ విరాళం అందించారు. కామినేని ఈశ్వరరావు 1952లో ఒలింపిక్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం అందించారు. తెలుగు భాషపై మమకారం ఉన్న ఆయన మధురావిజయం గ్రంథాన్ని 600 ఏళ్ల తరువాత తెలుగులోకి అనువదింపజేశారు. ఆయన సతీమణి అన్నపూర్ణాదేవి ఎన్నో ఆలయాలకు ఆర్థిక సాయం చేశారు. 10 మంది సంతానం కలిగిన వారంతా ఉన్నత విద్యావంతులే. 2005లో రెడ్డమ్మ చౌదరి, 2011లో అన్నపూర్ణాదేవి పరమపదించారు. వారి ఇద్దరి పేర్లతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి కుమారుడు రామరాయ చౌదరి సేవ చేస్తున్నారు.

ఎన్నారై ముసుగులో అక్రమాలు

● రూ. కోట్లలో అప్పు ఎగవేత ● రావి మురళిపై ఐటీడీపీ అధ్యక్షుడు పిల్లి కోటి ఆరోపణ

చిలకలూరిపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో సాయి కార్తీక్ కాంప్లెక్స్ అనే పేరుతో రావి మురళి అనే ఎన్నారై, ఆయన కుటుంబ సభ్యులు అనేక అక్రమాలకు పాల్పడ్డారని చిలకలూరిపేట నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు పిల్లి కోటి బుధవారం ఆరోపించారు. టీడీపీ సానుభూతిపరులైన అమాయక ప్రజలు, రైతుల వద్ద నుంచి కోట్ల రూపాయలు అప్పులు తీసుకుని తిరిగి ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారని చెప్పారు. బ్యాంకు రుణ వాయిదాల చెల్లింపునకు అవసరమని 17 మంది వద్ద నుంచి సుమారు రూ. 8 కోట్లు అప్పుతీసుకున్నారని తెలిపారు. తమ కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడని, మాయమాటలు చెప్పి కుటుంబ సభ్యులు అప్పు తీసుకుని కాంప్లెక్ నిర్మాణంతో పాటు కొన్ని చోట్ల స్థలాలు కొనుగోలు చేశారని వివరించారు. అప్పు ఇచ్చిన వారిని, ఎమ్మెల్యే పుల్లారావును అసభ్యంగా తిడుతూ సామాజిక మాధ్యమాలలో ఎన్నారై మురళి పోస్టింగులు పెట్టారని అన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు ఎటువంటి సంబంధంలేదని వివరించారు. ఎన్నారై మురళి పెట్టిన పోస్టింగులను అనేకమంది ఎన్నారైలు ఖండించిన విషయం చాలామందికి తెలుసునని అన్నారు. న్యాయం కోసం కాంప్లెక్స్ ఎదుట బాధితులు మౌన పోరాటం చేస్తే దానిని కూడా వక్రీకరించారని అన్నారు. ఎన్నారై రావి మురళి ఎక్కడో హైదరాబాదులో కూర్చొని బలవంతంగా అమ్మానాన్నలని బెదిరించి ప్రెస్ మీ ట్‌లో కూర్చోబెట్టి మాట్లాడటం కాదు, మీకు అప్పిచ్చి మోసపోయిన బాధితులకు న్యాయం చేసి మీ వ్యాపారాలు చేసుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. సానుభూతి కోసం వారి ఆస్తులను కబ్జా చేశారని అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. ఆ అవసరం బాధితులకు ఎప్పుడూ లేదని, అప్పు తీసుకున్న మొత్తాలు తిరిగి చెల్లిస్తే చాలని చెప్పారు. ఎన్నారై మురళి వ్యవహారాన్ని రాష్ట్ర మంత్రి లోకేశ్, పోలీసుల దృష్టికి బాధితులు చాలా కాలం క్రిందటే తీసుకెళ్లారని తెలిపారు.

రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా జూన్ 4

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలోనే 2024 జూన్ 4వ తేదీ ప్రజలు పోరాట దినంగా, సుపరిపాలన సంవత్సరంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపో తుందని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది క్రితం సరిగ్గా ఇదేరో జు వైసీపీ అవినీతి, అరాచకపాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా నిలిచి కూటమికి ఘన విజయం అందించారని హర్షం వ్యక్తం చేశారు. మొత్తం 175 స్థానాలకు 164 అసెంబ్లీ, 25కి 21 పార్లమెంట్ సీట్లలో కూటమిని గెలిపించిన తీరు తమపై ప్రజ లు నమ్మకానికి ప్రతి రూపంగా పేర్కొన్నారు. నాడు ప్రజలు ఇచ్చిన తీర్పు బలంతోనే సుపరిపాలన, సంక్షే మం, అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కష్టపడుతున్నారన్నారు. ఇలాంటి రోజును వైసీపీ వెన్నుపోటు దినంగా పాటించడం వారి దివాలా కోరుతనం, నీచత్వానికి నిదర్శమని మండిపడ్డారు. ప్రజల ఆకాంక్షల మేరకే తెలుగుదేశం, జనసేన, బీజే పీలు కట్టుబడి పనిచేస్తున్నాయన్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, ఇసుక మాఫియా, మద్యం మాఫియా, భూకబ్జాలతో ప్రజలను దోచుకున్నారన్నారు. ఈ ఏడాది సాధించిన విజయాలు కేవలం ఆరంభం మాత్రమేనని, ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపడానికి కూటమి ప్రభుత్వం కృషి కొనసాగుతూనే ఉంటుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

ఏపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా లింగంశెట్టి

● కమిటీలో మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలికి చోటు



లింగంశెట్టి ఈశ్వరరావు

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ క్రమశిక్ష ణా కమిటీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నేత లింగంశెట్టి ఈశ్వరరావు మరోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకపు ఉత్తర్వులు విడుదల చేశారు. 1978లో కాంగ్రెస్ అభ్యర్థిగా గుంటూరు -1 ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈశ్వరరావు అనంతరం ఏపీసీసీలో, ఏఐసీసీలో పలు పదవులు నిర్వహించారు. కమిటీలో మరో ఆరుగురు నేతలకు చోటు కల్పించారు. ఇందులో జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, మేరాజోతు సూర్యానాయక్‌లు ఉన్నారు. గతంలో ఏపీసీసీ అధ్యక్షుడిగా రఘువీరారెడ్డి వ్యవహరించిన సమయంలోనూ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా లింగంశెట్టి ఈశ్వరరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా లింగంశెట్టి మాట్లాడుతూ తనను క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యంఠాగూర్, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ పాలక్‌వర్మలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎంను కలిసిన యూపీఎస్సీ ర్యాంకర్ పవన్ కల్యాణ్



సీఎం చంద్రబాబు నాయుడును కలిసిన యూపీఎస్సీ ర్యాంకర్ చల్లా పవన్ కల్యాణ్, చిత్రంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, చల్లా రమేష్ తదితరులు

గుంటూరు సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఈ మధ్య వెల్లడి అయిన యూపీఎస్సీ ఫలితాల్లో 146వ ర్యాంకు సాధించిన చల్లా పవన్ కల్యాణ్ బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అచ్చంపేట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన యూపీఎస్సీ ర్యాంకర్ పవన్ కల్యాణ్‌ను సీఎం వద్దకు ప్రత్యేకంగా తీసుకువెళ్లారు. కఠోర శ్రమతో పవన్ కల్యాణ్‌ను ఉన్నత స్థానంలో ఉండేలా ప్రోత్సహించిన తల్లి దండ్రులు చల్లా రమేష్, భువనేశ్వరిని సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

జీడీసీసీ చైర్మన్‌గా మక్కెన నేడు ప్రమాణ స్వీకారం

వినుకొండ, జూన్ 4, (ఆంధ్రజ్యోతి) మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గురువారం గుంటూరులోని బ్రాడీపేట నందు గల జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయం ఆవరణలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి

ఇక ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం

● వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి రాజశేఖర్

గుంటూరు సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాలని నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ వెల్లడించారు. గుంటూరు జిల్లాలోని వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్‌లకు బుధవారం నుంచి ప్రకృతి వ్యవసాయంపై ఆరంభం అయిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి జూమ్‌లో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఒక నమూనాగా మారిన నేపథ్యంలో ప్రధానమంత్రి కూడా దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ మాట్లాడుతూ దేశంలోనే ప్రకృతి వ్యవసాయం మిషన్ ఆరంభమైందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ఏడీఏలు వారి పరిధిలోని గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకులు ఎస్.ఢిల్లీరావు, హార్టికల్చర్ సంచాలకులు కే.శ్రీనివాస్, రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు, సీనియర్ కన్సల్టెంట్ రాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం అంతటా పండుగ వాతావరణం

● జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం గెలిచి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రం అంతటా పండుగ వాతావరణంలో వేడుకలు జరుపుకుంటున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం జనసేన పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా సంక్రాంతి, దీపావళి పండుగ తరహాలో సంబరాలు జరుపుకున్నారు. వీర మహిళలు సంప్రదాయబద్ధమైన అందమైన ముగ్గులతో లోగిలిని అలంకరించారు. బాణా సంచా కాల్చి పండుగ వాతావరణం సృష్టించారు. ఈ వేడుకల్లో జనసేన నేతలు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బోనబోయిన మాట్లాడుతూ రాబోయే నాలుగేళ్ల కాలంలో కూడా ప్రజా సంక్షేమ పాలన కూటమి ప్రభుత్వం అందిస్తుందని జనసేన తరపున తాము హామీ ఇస్తున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటికి తన బుద్ధి మార్చుకోని జగన్ మోహన్‌రెడ్డి తన ఓటమికి కారణమైన ప్రజా తీర్పును అవమానపర్చేలా జూన్ నాల్గవ తేదీని వెన్నుపోటు దినంగా పేర్కొంటూ ప్రజలపై తన అక్కసు ఇంకా వెళ్లగక్కడం సిగ్గు చేటని బోనబోయిన మండిపడ్డారు.



రంగవల్లులను తిలకిస్తున్న బోనబోయిన, గాదె తదితరులు

విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విధ్వంసకర వైసీపీ పాలన నుంచి గత ఏడాది బయటపడిన ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ పాలనలో వికాసం వైపు పయనిస్తున్నట్లు జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. వైసీపీ పాలన అంతమై ఏడాది పూర్తయిన సందర్భంగా జనసేన పార్టీ ఇచ్చిన పిలుపు 'పీడ విరగడైంది' పేరిట బుధవారం సాయంత్రం శ్రీనివాసరావుతోటలో జనసైనికులు సంబరాలు జరిపారు. దీపాలు వెలిగించి బాణా సంచా కాల్చారు. గాజు గ్లాస్ దిమ్మెను దీపాలతో అలంకరించారు. ఆళ్ల హరి మాట్లాడుతూ పురాణాల్లో దేవతలను పీడించిన నరకాసురుడి పాలనకు, ప్రజాకంటక పాలనతో ప్రజలను పీక్కుతిన్న జగన్‌రెడ్డి పాలనకు తేడా లేదని విమర్శించారు. మోదీ సహకారంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నట్లు హరి తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మెహబూబ్ బాషా, సుబ్బారావు, భవానీ, ధరణి, కోలా ఆంజనేయులు, బాలకృష్ణ, మిరియాల వెంకట్, నరసింహరావు, చింతకాలయ సాయి, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు

ఆర్వీఆర్ జేసీలో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ

గుంటూరు (విద్య), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో 10 రోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు దేశభక్తికి, సమాజ సేవకు మారుపేరుగా సమాజంలో కొనియాడబడాలని లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్. సుదర్శన్ అన్నారు. శిక్షణ కాలంలో క్యాడెట్లు ఫిజికల్ ట్రైనింగ్, డ్రిల్, ఆయుధ శిక్షణ, స్వచ్ఛత, నాయకత్వ లక్షణాలపై ప్రత్యేకంగా శిక్షణ పొందారు. చివరి రోజు క్యాడెట్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ మేజర్ అవినాశి పట్వాల్, క్యాంపు సీనియర్ జేసీవో ఇమాం సాహెబ్ షేక్, క్యాంపు ట్రైనింగ్ జేసీవో ఆర్ఎస్ రాజు, క్యాంపు సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖర బాబు, కళాశాల ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ తారాచంద్, డాక్టర్ ఉషా క్రాంతి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకుంటున్న ఎన్‌సీసీ క్యారెట్లు

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు (తూర్పు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్, శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 9వ తేదీ వరకు జరుగుతాయని ధనకుదరం శ్రీనివాసాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అష్టోత్తర శత కలశాభిషేకం, అంకురారోపణ, 6న ధ్వజారోహణం, నిత్య హోమం, 7న స్వామి వారి కల్యాణమహోత్సవం, లక్ష మల్లెల, తులసి దళార్చన, 8న శ్రీవారి రథోత్సవం, 9న మహాపూర్ణాహుతి, వసంతోత్సవం, తిరుప్పావడ సేవ అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతాయని తెలిపారు.

క్లీన్, గ్రీన్ గుంటూరు సాధనే ధ్యేయం

● మేయర్ కోవెలమూడి రవీంద్ర



ప్రసంగిస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్, కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు సాధనే ధ్యేయంగా నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలపై కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కార్పొరేటర్లు, నోడల్ అధికారులతో బుధవారం సంయుక్త సమావేశం జరిగింది. మేయర్ రవీంద్ర మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలో వార్డుల వారీగా కార్పొరేటర్లకు మొక్కలు, గుడ్డ సంచుల ను జీఎంసీ నుంచి అందించుట జరుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కార్పొరేటర్ల భాగస్వామ్యం పెరగాలన్నారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో ఈ సీజన్‌కి 5 లక్షల మొక్కలు నాటేలా వార్డు సచివాలయాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. అలాగే ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ధరకు గుడ్డ సంచులను అందించే లా గాంధీ పార్కు, ఎన్టీఆర్ స్టేడియం దగ్గర వెండింగ్ మెషిన్లను అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే ఒక కిలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఇస్తే గాంధీ పార్కు ఎంట్రీ టికెట్ అందించటం జరుగుతున్నారు. గురువారం ఉదయం స్థానిక కన్యకా పరమేశ్వరి గుడి దగ్గర నుండి హిమని సెంటర్ వరకు మాస్ క్లీనింగ్ చేస్తూ, పర్యావరణ పరిరక్షణపై అవగాహనా ర్యాలీ జరుగుతుందన్నారు.

తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వం, అధికారులదే కాదని, ప్రజల భాగస్వామ్యం ఉంటేనే విజయవంతం అవుతుందన్నారు. ప్రతి డివిజన్‌కు అందించే మొక్కలను సక్రమంగా ప్రజలు సంరక్షించేలా అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సమీకృత హాస్టల్ భవనం తక్షణం ప్రారంభించాలి

● ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్

గుంటూరు (విద్య), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న సమీకృత హాస్టల్ భవనాన్ని వెంటనే ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సమీకృత హాస్టల్ వద్ద బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ హాస్టల్ నిర్మాణం పూర్తయినప్పటికీ విద్యార్థులకు మాత్రం అందుబాటులోకి రావడం లేదని, విద్యార్థుల పోరాటంతో డిసెంబరులోనే ప్రారంభిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినా నేటికీ విద్యార్థులకు అందుబాటులోకి రాలేదన్నారు. ఎస్సీ, బీసీ వందలాది మంది చదువుకోవాల్సిన హాస్టల్లో ఖాళీగా ఉండటం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఏ.యశ్వంత్, ఉపాధ్యక్షులు సుభాని, బి.రాకేష్ సుభాష్ పాల్గొన్నారు.

9న జిల్లా స్థాయి చదరంగం పోటీలు

గుంటూరు(తూర్పు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఇంటాక్ గుంటూరు జిల్లా చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక భారతీయ విద్యా భవన్‌లో ఈ నెల 9న అండర్-15 బాల బాలికలకు విభాగంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్టు భారతీయ విద్యాభవన్, గుంటూరు కేంద్ర కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. విద్యాభవన్లో బుధవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆనంద్ చెస్ అకాడమీ నిర్వాహకుడు గోపి మాట్లాడుతూ ఆసక్తి గలిగిన క్రీడాకారులు తమ దరఖాస్తులను 8వ తేదీలోపు భారతీయ విద్యా భవన్‌లో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 97030 49378, 91245 19444 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్, చాప్టర్ కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకర గణేష్‌కి డీఆర్ఎం అభినందనలు

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భాష్యం ఐఐటీ క్యాంపస్‌లో చదివి జేఈఈ-2025 అడ్వాన్స్‌డ్ పరీక్షలో జాతీయ స్థాయిలో 104వ ర్యాంకు సాధించిన రైల్వే లోకో పైలట్ ఎం.భానుకృష్ణారావు కుమారుడు శ్రీకర గణేష్‌ని డీఆర్ఎం సుదేష్ణ సేన్ అభినందించారు. బుధవారం ఆమె పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌కు గణేష్‌ని పిలిపించి సన్మానించారు. ప్రతిష్టాత్మక ఐఐటీ క్యాంపస్‌లో చేరి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ మద్దాళి రవికిరణ్, ఏడీఎంఈలు సీహెచ్ బాపయ్య, కే రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఆర్టీఈ ప్రవేశాలను నిరాకరించే పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

గుంటూరు (విద్య) జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రైవేట్ , కార్పొరేట్ పాఠశాలల్లో విద్యకు చట్టం ద్వారా వచ్చిన ప్రవేశాలను అడ్డుకునే పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏపీ సిటిజన్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ జిలాని విజ్ఞప్తి చేశారు ఈ మేరకు బుధవారం డీఈఓ సీవీ రేణుకకు వినతిపత్రం అందజేశారు. అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఆర్టీఈ ప్రవేశాలను అడ్డుకుంటున్నాయని, ప్రవేశాల కోసం విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులను చులకన చేసి మాట్లాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దాదా కరీం, సత్య, సందీప్ బాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు వన మహోత్సవానికి పటిష్ట బందోబస్తు

● ఏర్పాట్లు పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నేడు రాజధానిలో జరగనున్న వన మహోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆయా ఏర్పాట్లను పరిశీలించారు.

గుంటూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా అభ్యాస కార్యక్రమంలో పాల్గొని పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ యోగా వలన శారీరక దృఢత్వం, మానసిక స్థిరత్వం, ఆలోచనా సామర్థ్యం మెరుగు పడతాయన్నారు. యోగా, ధ్యానం అనేవి శారీరకంగా, మానసికంగా మనిషి స్థితిగతులను మార్చగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయన్నారు. .యోగా, ధ్యానం అభ్యాసం వలన మనిషి ఆలోచనా విధానం, సామర్థ్యం మెరుగుపడతాయన్నారు. మానసిక స్థిరత్వం, ప్రశాంతత అలవడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ.హనుమంతు, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి ఆర్ఐ శ్రీహరిరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతి కార్యక్రమంలో పాల్గొన్న రవీంద్ర తదితరులు

గానగంధర్వుడు.. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం

● మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు(తూర్పు), జూన్ 4(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల గుండెల్లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గాన గంధర్వుడిగా నిలిచిపోయారని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. బాల సుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకొని నాజ్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తెలుగువాడిగా పుట్టటం మన అదృష్టమని అన్నారు. పదివేలకు పైగా అన్ని భాషలలో పాడిన ఏకైక గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని కొనియాడారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేసిన కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరు రంగారావును అభినందిస్తున్నట్టు పేర్కొన్నారు. త్వరలోనే ఎన్టీఆర్ స్టేడియంలో ఆయన పాటల కచేరిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాదర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు, సభ్యులు ఇక్కుర్తి భాను ప్రకాష్, వేణుగోపాల్, బాబురావు, రాధా రాణి, అన్నపూర్ణ సత్తార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాపంగా మారిన జీవోలను రద్దు చేయాలి

గుంటూరు(తూర్పు), జూన్ 4(ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు శాపంగా మారిన 77, 107, 108 జీవోలను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో విద్యార్థులకు ఒరిగిందేమి లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో అలసత్వం వహిస్తుందని మండిపడ్డారు. మైనారిటీ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా హాస్టల్లో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, అటెండర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి యశ్వంత్ నితిన్, కిరణ్, సాయి గణేష్, అజయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసగించిన కూటమి ప్రభుత్వం

● వైసీపీ జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్

గుంటూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సమాజంలో అన్ని వర్గాలను మోసగించిందని వైసీపీ జిల్లా పరిశీలకులు పోతిన మహేష్ విమర్శించారు. వెన్నుపోటు దినం పేరుతో వైసీపీ పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమం బుధవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను గాలి కొదిలేసిందని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజలను, రైతులను, యువతను అన్నివర్గాలను పథకాల పేరుతో మోసం చేసిందన్నారు. అనంతరం నేతలు డీఆర్‌వో ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. వైసీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, పలువురు వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.



అక్కడ కొంతమంది ఆరోగ్యం కోసం యోగా చేస్తున్నారు. అసలు అక్కడ ఏం జరుగుతుందో బొత్తిగా తెలియని ఒక వృద్ధుడు ఆకలిని తీర్చుకునేందుకు బిక్షాటన చేస్తున్నారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

క్షేత్రస్థాయిలో పర్యటనలకు సీఎండీ శ్రీకారం

● బాపట్లలో విస్తృత పర్యటన.. మొన్నటి పల్నాడులో సమీక్ష ● నేడు గుంటూరులో పుల్లారెడ్డి పర్యటన

గుంటూరు, జూన్4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ నూతన సీఎండీగా బాధ్యతలు చేపట్టిన పుల్లారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటనకు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అస్తవ్యస్త విధానాలతో పాటు రెవెన్యూ పరమైన అంశాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్‌తో కలిసి సీఎండీ పుల్లారావు సోమవారం నూతనంగా ఏర్పడిన బాపట్ల సర్కిల్‌ను సందర్శించారు. అధికారులతో కలిసి వారు సమావేశం నిర్వహించిన ఆయన అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముఖ్యంగా కొత్త సర్కిల్స్ విభజన ప్రక్రియ, డివిజన్‌లు, వాటి స్వరూపాలు, ఆదాయ, వ్యయాలు వంటి అంశాలను అధికారులను తెలుసుకున్నారు. మరో వైపు నాలుగు రోజుల కిందటే పల్నాడు సర్కిల్ కేంద్రమైన నరసరావుపేట సర్కిల్‌ను సందర్శించారు. నరసరావుపేట సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ డాక్టర్ విజయ్‌కుమార్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. పల్నాడు సర్కిల్ స్వరూపం, డివిజన్‌ల వారీగా జరిగిన విభజన ప్రక్రియపై అధికారులతో చర్చించారు. అలానే రెవెన్యూ పరమైన అంశాలపై అధికారులతో సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో పర్యటనల్లో భాగంగా ఈనెల 5న జిల్లా కేంద్రం గుంటూరు సర్కిల్ విద్యుత్ భవన్‌ను కూడా సందర్శించనున్నట్లు ఇప్పటికే అధికారులకు సమాచారం అందింది. సర్కిల్ పరిధిలోని గుంటూరు, తెనాలి డివిజన్ వారీగా ఆయన సమీక్షించనున్నట్లు తెలిపారు.

సర్కిల్ విభజన ప్రక్రియలో మార్పులకు ఛాన్స్....

వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్ పునర్విభజనలో అధికారులు ఎటువంటి హేతుబద్ధత పాటించలేదన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో నూతన సీఎండీగా బాధ్యతలు చేపట్టిన పుల్లారావు, టెక్నికల్ డైరక్టర్ మురళీకృష్ణయాదవ్‌ల నేతృత్వంలో పునర్విభజనలో జరిగిన తప్పిదాలలో లోటు పాట్లను పూడ్చే పనిలో ఉన్నట్లు సమాచారం. ఇందులో భాగంగా సీఎండీ క్షేత్రస్థాయిలో పర్యటన చేయటంతో పాటు వైసీపీ హయాంలో జరిగిన అస్తవ్యస్త విధానాలపై కూడా సమాచారం తెలుసుకుంటున్నట్లు తెలిసింది.



డ్రైయిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఏడాదిలోనే నవశకానికి నాంది

● నేడు అభివృద్ధి, సంక్షేమంలో అగ్రస్థానం

● వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధికి కొత్త పునాదులు వేశామని, ఇది ప్రజల ఆశీర్వాదంతోనే సాధ్యమైందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని రత్నపురి కాలనీ, మల్లికార్జునపేట, శారదా కాలనీలలో బుధవారం ఉదయం ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి ఆయా ప్రాంతాలలో ప్రభుత్వపరంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. రేషన్ కార్డులు, మంచినీటి సరఫరా, పెన్షన్లు, రోడ్లు, శానిటేషన్ వంటి సేవలపై లబ్ధిదారులతో మాట్లాడారు. ఎవరికి ఎలాంటి సర్వీసు అందకపోయినా తనను నేరుగా సంప్రదించవచ్చని ప్రజలకు సూచించారు. అనంతరం శానిటేషన్‌కు సంబంధించి మురుగునీటి వ్యవస్థ ఇంకా మెరుగుపడాలని అధికారులకు సూచించారు. గతంలో గుంటూరు తీర్పు నియోజకవర్గమంటే వెనకబడిన ప్రాంతంగా చూసేవారని, ఐదేళ్లపాటు ప్రజలు తీవ్రంగా విసిగిపోయారని తెలిపారు. తాము అధికారం చేపట్టిన వెంటనే ప్రణాళికాబద్ధంగా రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ముందడుగు వేశామని తెలిపారు. ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోనే నవశకానికి నాంది పలికిందని చెప్పారు. పారిశ్రామికంగా, అభివృద్ధి పరంగా, సంక్షేమ పరంగా ఆదర్శవంతమైన నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో మహంకాళి నరసింహారావు, పఠాన్ బాజీ, గిరిబాబు, మోహన్, బాబురావు, దయారత్నం, కోటా పిచ్చిరెడ్డి, జమీర్, హఫీజ్ పాల్గొన్నారు.

జూన్ 4 ప్రజాస్వామ్యం బతికిన రోజు

● మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతికిన రోజు పోయినేడాది జూన్ 4వ తేదీ అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనను ఓర్పుతో భరించిన ప్రజలు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పారని, జూన్ 4వ తేదీ భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయానికి ముగింపు పలికిన రోజని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, మంచి పాలకులను ఎన్నుకొనే స్వేచ్ఛ ప్రజలకే ఉందని మరోసారి నిరూపించారని, రాష్ట్రాన్ని యథేచ్ఛగా కొల్లగొట్టిన జగన్ ముఠాను ప్రజలు అధఃపాతాళానికి తొక్కారన్నారు. యువత, రైతులు, ఉద్యోగులు, మహిళలు, విద్యావంతులు, వ్యాపారులు, మధ్య, ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాలకు చెందిన ప్రజలు అవినీతి అసమర్థ పాలనకు చరమగీతం పాడారు.

7న ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం

గుంటూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య 42 వ ఆవిర్భావ దినోత్సవం ఈనెల 7వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి మాదిరాజు తరుణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ జాతి అభివృద్ధి, సంక్షేమం, ఐక్యత కోసం ఏర్పాటు చేసిన సమాఖ్య 41 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందన్నారు. నూతన అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ నేతృత్వంలో తొలిసారిగా సమాఖ్య నూతన పతాకంను గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డులోని కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అలానే సమాఖ్య వెబ్‌సైట్‌ను సంఘం కోశాధికారి పులిపాక ప్రసాద్ ప్రారంభిస్తారన్నారు.

శ్రీ మద్భగవద్గీతపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో బుధవారం శ్రీమద్భగవద్గీత 15వ అధ్యాయం పురుషోత్తమప్రాప్తియోగం ప్రవచనం జరిగింది.

తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయామిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచనాన్ని ప్రారంభిస్తూ వాయువు వాసనలను ఒకచోటి నుంచి వేరొక చోటికి తీసికొని పోయినట్లు దేహాదులకు జీవాత్మ ఒక శరీరాన్ని, మనస్సు, ఇంద్రియాలను గ్రహించి వాటితో కూడా మరొక శరీరాన్ని పొందుతారన్నారు. పంచేంద్రియాలను, మనస్సును ఆశ్రయించి, శబ్దాది విషయాలను అనుభవిస్తారని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి తెలియజేశారన్నారు.

వైభవంగా బాబా వారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), జూన్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీ షిరిడి సాయి నాథ మందిరంలో 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం బాబా వారికి కాకడ హారతి, పంచామృతాలతో విశేష అభిషేకాలు, తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులచే గురు చరిత్ర, సాయి చాలీసా పారాయణం భక్తి ప్రపత్తులతో గావించారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మామిడి సీతారామయ్య, మామిడి రామారావు పర్యవేక్షించారు.







మా"నస" సరోవరంలో... ఆహ్లాదం కను"మ(ము)రుగు"

అది గుంటూరు నగరంలో ఉన్న ఒకే ఒక ఆహ్లాదకరమైన ప్రదేశం.... పచ్చని చెట్లు వాటి నడుమ పారే సెలయేరులో బోటింగ్ చేస్తూ.... పచ్చిక బయళ్ళలో చెట్లపై ఉన్న పక్షులను, జంతువులను చూస్తూ ఆహ్లాదకరంగా నగర ప్రజలు గడిపేందుకు వచ్చేవారు. ఇది నగర సమీపంలో ఉన్న ఒకప్పటి మానస సరోవరం పరిస్థితి. తాజాగా ఇక్కడ ఆహ్లాదం కనుమరుగై ఆ ప్రాంతమంతా మురుగునీటి గుంటల్ని తలపిస్తోంది. రెండున్నర దశాబ్దాల క్రితం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ ఉద్యానవనం ప్రస్తుతం అధ్వాన స్థితికి చేరింది.పచ్చిక బయలు స్థానంలో బురదమయంగా మారింది. గుంటూరు నగరం సమీపంలోని తక్కెళ్ళపాడు వద్ద ఉన్న మానస సరోవరం దుస్థితి.

-గుంటూరు (ఆంధ్రజ్యోతి)

వెంటాడుతున్న.. ప్లాస్టిక్ భూతం



● చర్యలు తీసుకొంటున్నా వదలని ప్లాస్టిక్ ● మానవ శరీరాల్లోకి చొచ్చుకొస్తున్న సూక్ష్మ ప్లాస్టిక్ పదార్థాలు ● నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

గుంటూరు, బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మానవాళికే కాకుండా జంతుజాతులకు నేడు ప్లాస్టిక్ ముప్పుగా పరిణమించింది. ప్రపంచ వ్యాప్తంగా ఏ మూలకు వెళ్లినా ప్లాస్టిక్‌తో ఉత్పత్తి అయిన వస్తువులే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ ఉత్పత్తులు పర్యావరణానికి సవాలు విసురుతున్నాయి. వీటిని సరైన పద్ధతిలో డిస్పోజ్ చేయడం లేదు. డస్టుబిన్‌లు, డ్రెయిన్లలో బాధ్యతారహితంగా పడేస్తున్నారు. డ్రెయిన్లలో వేసినవి వర్షాకాలం వరదనీటితో పాటు ప్రవహించి నదులు, సముద్రాల్లోకి చేరిపోతున్నాయి. డస్టుబిన్‌లలో వేసినవి జంతువుల కడుపులోకి చేరి వాటి ఆయువుని తీస్తున్నాయి. ప్లాస్టిక్ వలన తనకేమి కాదులే అన్న నిర్లక్ష్యం ప్రతీ ఒక్కరిలో గూడు కట్టుకుపోయింది. అయితే అవి క్రమక్రమంగా ప్రజల శరీరాల్లోకి సూక్ష్మంగా చేరుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే కచ్చితంగా మన పర్యావరణం దెబ్బతినడం ఖాయం. ఈ ప్రమాదాన్ని దశాబ్ధాల క్రితమే గ్రహించిన యూ ఎన్‌వో ఏటా జూన్ 5వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఈ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. 2025 సంవత్సరానికి ప్లాసిక్ కాలుష్యాన్ని ఓడించు అన్న నినాదాన్ని ఇచ్చింది. ఇప్పటికే దీనిపై రైల్వేలో 15 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అవగాహన తీసుకొచ్చేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు ప్రజలంతా సంఘీభావం ప్రకటించి ఆచరిస్తే కొంతలో కొంత మార్పు అయినా వస్తుంది.

జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని కొన్ని సంవత్సరాల క్రితమే నిషేధించారు. అయితే వాటిపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నగరపాలకసంస్థ, మునిసిపాలిటీలు అరకొరగా దాడులు నిర్వహించి రూ. 500 నుంచి రూ. 1500 వరకు పెనాల్టీ వేయడం తప్పా ఎవరైతే వాటిని వినియోగిస్తున్నారో వాళ్లలో మార్పు తీసుకురాలేకపోతున్నాయి. నేడు ఏ వ్యాపార దుకాణానికి వెళ్లి చూసినా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, స్ట్రాలు, టార్పాలిన్ పట్టాలు, స్పూన్‌లు, వాటర్, కూల్ డ్రింక్స్ పెట్ బాటిల్స్, గ్లాసులు, రైస్‌బ్యాగులు, ఆహార పదార్థాలు ప్యాక్ చేసే ప్లాస్టిక్ డబ్బాలు, పాలప్యాకెట్లు వంటివి కనిపిస్తూనే ఉన్నాయి. వీటిని వినియోగదారులు ఒకసారి వాడటం మరుసటి రోజున డస్టుబిన్/కాలువలో పడేయడం చేస్తున్నారు. రీయూజబుల్ వస్తువులను మొక్కుబడిగా వినియోగించడం మినహా ఎప్పుడో వాటికి మంగళం పాడేశారు. స్టీలు, గ్లాసు వంటి పాత్రలను వినియోగించడం లేదు. గతంలో వేసవి వచ్చిందంటే ఊరగాయ పచ్చళ్లు పింగాణితో తయారు చేసిన జాడీల్లో పెట్టేవారు. నేడు వీటిని కూడా ప్లాస్టిక్ బక్కెట్‌లు ఆక్రమించేశాయి.

స్థానికంగానూ ఇక్కడ ప్లాస్టిక్ వస్తువుల తయారీ ఫ్యాక్టరీలుండగా, ఎక్కువగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో తయారైన ఉత్పత్తులు నిత్యం టన్నుల కొద్దీ దిగుమతి అవుతున్నాయి. వీటిని నియంత్రించే పరిస్థితి జిల్లాలో ఏ కోశాన కనిపించడం లేదు. పెనాల్టీలతో సరిపెడుతుండటం వలన వినియోగదారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా జూట్‌బ్యాగులు, స్టీలు, గాజు పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించడం లేదు. ఒకదశలో అధికార యంత్రాంగం గట్టిగా చర్యలు తీసుకోవడంతో చాలామంది ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా క్లాత్‌బ్యాగులు వినియోగించారు. అనతికాలంలోనే అది అటకెక్కి మళ్లీ యథాతథ స్థితికి చేరుకున్నది. సూక్ష్మ ప్లాస్టిక్ పదార్థాలు మానవుల శరీ రాల్లోకి ప్రవేశిస్తున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా మార్పు రావడం లేదు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనేది ఒకటి ప్రతీ జిల్లాలోనూ ఉన్నది. అయితే దీనికి ఒక ఈఈ స్థాయి అధికారి, కొద్ది మంది సిబ్బంది మాత్రమే ఉంటారు. వీళ్లు ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి ఒక వారం ముందు ఎంతో ఘనంగా కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరింప చేస్తారు. జూన్ 5వ తేదీన ఒక ర్యాలీ, సమావేశం నిర్వహించి మమ అనిపిస్తారు. అంతకుమించి ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోరు. ప్రజల్లో మార్పు తీసుకురావడానికి నిరంతరం చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఏ ఒక్కరూ ఆలోచన చేయడం లేదు. అవగాహన కార్యక్రమాలు నిత్యం జరిగి ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేసే చర్యలు కొనసాగితేనే కొంతలో కొంత మార్పు వస్తుంది. లేదంటే ప్లాస్టిక్ దెబ్బకు పర్యావరణం కుప్ప కూలిపోయే పరిస్థితి ఎంతో దూరంలో లేదన్నది ప్రతీ ఒక్కరూ గ్రహించాలి.



బాపట్ల మండలం ముత్తాయపాలెంలో రోడ్డు పక్కనే డంప్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్తాచెదారం

ప్రమాదంలో పర్యావరణం

ప్లాస్టిక్ కాలుష్యం గ్రహసంక్షోభంగా మారింది. మైక్రోప్లాస్టిక్‌లు మహాసముద్రాలు, పర్వతశిఖరాలు, మానవ దేహాల్లోనూ కనిపిస్తున్నాయి. నానాటికి పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. రుతువులు గతితప్పుతున్నాయి. అడువులు అంతరించిపోతున్నాయి. భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి. నదులు, సముద్రాలు కలుషితమౌతున్నాయి. ఈవిధంగా జరిగితే మానవ మనుగడ ప్రమాదపుటంచులో పడుతుంది. అడవుల్లో చెట్లను విచ్చలవిడిగా నరికివేయడంతో పచ్చనిచెట్లు ఎండిపోతున్నాయి. తీరంలోని మడ అడవులు అంతరించిపోయాయి. అదేవిధంగా తీరంలో విస్తరించిన చెట్లు సైతం సంరక్షణ లేక ఎండిపోతున్నాయి. బాపట్ల మండలం సూర్యలంక తీరంలో అటవీప్రాంతం నానాటికి అంతరిస్తున్నది. దీనివల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్తులో మానవజీవితం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.



బాపట్ల మండలం సూర్యలంక తీరంలోని అటవీప్రాంతంలో ఎండిపోతున్న మోడులతో ఉన్న చెట్లు

నేడు రాజధానిలో... వనమహోత్సవం

● హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ● అనంతవరం పార్క్‌లో ఒకే సారి రెండు వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు



సిద్ధం అయిన వేదిక



అనంతవరం పార్క్‌లో నాటేందుకు లారీలో నుంచి దించుతున్న మొక్కలు

తుళ్లూరు, (అనంతవరం) జూన్ 4, (ఆంధ్ర జ్యోతి) రాజధాని అమరావతి నగరాన్ని బ్లూ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దటమే ధ్యేయంగా పెట్టుకున్న సీఎం చంద్రబాబు నాయుడు గతం లో కూడా రాజధానిలో పెద్ద ఎత్తున వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క మొక్క నాటింది లేదు. తిరిగి అమరావతికి పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగు లు వేస్తుంది. రాజధాని గ్రామం అనంతవరం రెవెన్యూలో గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 20 ఎకరాల పార్కులో గురువారం ప్రపంచ పర్యావరణ దినత్సవాన్ని పురస్కరించుకొని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు 36 గంటల్లో పూర్తి చేయటం విశేషం. ఒకేసారి రెండు వేల మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేశారు. సభా వేదిక పనులు పూర్తి చేశారు. రైతులు, రైతు కూలీలు, మహిళలు సీఎం కార్యక్రమానికి భారీగా హాజరవుతారని అధికారులు చెపుతున్నారు. భారీ ఎత్తున పోలీసు బలగాలు సభా వేదిక వద్దకు చేరుకున్నాయి. కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నారు. వేదిక దక్షిణం వైపు పబ్లిక్ పార్కింగ్ కోసం చదును చేశారు. వర్షం పడినా ఇబ్బందులు లేకుండా కార్యక్రమం సజావుగా జరిగేందుకు ఏర్పాటు చేస్తున్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ, సీఎం చీఫ్ సెక్యూరిటీ అధికారి, ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఏడీసీ, సీఆర్డీఏ, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లను సమీక్షించారు. సభకు వచ్చే వారికి మంచి నీరు, అల్పాహారం అందించే ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు సీఎం, డిప్యూటీ సీఎం వేదిక వద్దకు వస్తారు. మొక్కలు నాటిన అనంతరం వేదిక నుంచి ప్రసంగిస్తారు. 12.30 గంటల కల్లా కార్యక్రమం ముగుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో జిల్లా లిఫ్టర్ల సత్తా

మంగళగిరి సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలు పట్ట ణంలో ఈ నెల రెండో తేదీ వరకు మూడు రోజులపాటు జరిగిన ఏపీ స్టేట్ సబ్‌జూనియర్స్, జూని యర్స్, సీనియర్స్ మాస్టర్స్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, బెంచిప్రెస్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన పవర్ లిఫ్టర్లు సత్తా చాటారు. ఈ వివరాలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని బుధవారం వెల్లడించారు. ఆయా విభాగాల్లో వ్యక్తిగత పతకాలతోపాటు సబ్ జూనియర్స్‌లో బాలికల టీం చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం, బాలుర టీం చాంపి యన్‌షిప్‌లో తృతీయ స్థానం, జూనియర్స్ మహిళల టీం చాంపియన్ షిప్‌లో ప్రథమ స్థానం, జూనియర్స్ పురుషుల టీం చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం, సీనియర్స్ మహిళల టీం చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం, సీనియర్స్ పురుషుల టీం చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం, ఓవరాల్ టీం చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం సాధిం చారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధి కారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.



పతకాలు సాధించిన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

ఇసుక రీచ్‌ల మూతతో.. ఇక్కట్లు

ఉపాధి కోల్పోయిన కార్మికులు


శిథిలావస్థలో ఇసుక పడవలు

ఆరేళ్లుగా పనుల్లేక ఇబ్బందులు

కూటమి పనులు కల్పిస్తుందని ఎదురుచూపు

అచ్చంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇసుక కార్మికులు ఉపాధి కోల్పోయి ఆరు సంవత్సరాలు కావస్తుంది. లక్షల రూపాయల విలువ చేసే ఇసుక పడవలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని కస్తల, కోనూరు, అంబడిపూడి, చామర్రు తదితర ప్రాం తాల్లో ఇసుక విరివిగా లభ్యమవుతుంది. ఇసుక రీచ్‌లు కూడా ఉన్నాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మండలంలోని కార్మికులకు, దూర ప్రాంతాల నుంచి ఉపాధికి వచ్చే కార్మికులకు పనులు లేక ఉపాధి కోల్పోయారు. వైసీపీ ప్రభుత్వంలో మూతపడిన ఇసుక పడవలు ఒడ్డుకు చేరి శిథిలావస్థకు చేరుకున్నాయి. కస్తల కృష్ణానది ఒడ్డున సుమారు వందకు పైగా ఇసుక పడవలు ఉన్నాయి. ఇవే కాక చుట్టు పక్కల రేవుల్లో నుంచి ఇసుక పడవలు వస్తుంటాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రేవులో మూడు వందలకు పైగా ఇసుక పడవలు ఉన్నాయి. ఒక్కో పడవకు 15 మంది కార్మికులు, క్రేన్ దగ్గర పని వారు, లారీల వద్ద పని చేసే వారు సుమారు ఒక్క కస్తల రేవులోనే నాలుగు వేల మందికి పైగా నిత్యం పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు. అలాంటిది వైసీపీ ప్రభుత్వం రావటంతో పడవలకు పనుల్లేక ఇసుక కార్మికులు జీవనోపాధి కోల్పోయారు. ఒడ్డుకు చేరిన ఒక్కో పడవ ఖరీదు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. అలాంటి పడవలు నేడు శిథిలావస్థకు చేరి మరమ్మతులకు లోనయ్యాయి.

ఉపాధి కోల్పోయిన ఇసుక కార్మికులకు కూటమి పనులు కల్పిస్తుందని పడవల యజ మానులు, ఇసుక కార్మికులు ఎదురు చూస్తున్నారు. పెదకూరపాడు, సత్తెనపల్లి, బెల్లం కొండ, క్రోసూరు, అచ్చంపేట మండలాల వారే కాక కృష్ణా జిల్లా నుంచి కూడా వచ్చి ఇక్కడ పనులు చేసుకునేవారు. నిత్యం వేలాది మంది కార్మికులకు ఉపాధి కలుగ చేసిన ఇసుక రేవు నేడు వెలవెల బోతుంది.



కస్తల గ్రామ కృష్ణానది ఒడ్డున నిలిచి ఉన్న ఇసుక పడవలు



శిథిలావస్థలో ఉన్న పడవను బాగు చేసుకుంటున్న యజమాని

పనులు కల్పించండి



కస్తల ఇసుక రేవులో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వందలాది మందికి పని దొరి కేది. పడవలకు పనులు దొరకటం వల్ల అనేక మంది కార్మికులు ఉపాధి పొందేవారు. 20 సంవత్సరాల నుంచి ఇసుక పని చేస్తున్నాను పది లక్షలు వెచ్చించి ఇసుక పడవ కొనుగోలు చేశాను. ఆరు సంవత్సరాలుగా ఇసుక పని లేక ఇబ్బందులు పడుతున్నాను. పనులు కల్పించండి.

సయ్యద్ మహబూబ్ సుభాని, పడవ యజమాని

ఎండకు ఎండి మరమ్మతులు



పనులు లేక ఒడ్డున ఉంచటం వల్ల లక్షల ఖరీదు చేసే పడవలు ఎండకు ఎండి మరమ్మతులకు వచ్చాయి. సుమారు రెండు లక్షలు ఖర్చవుతుంది. కూటమి ప్రభుత్వం ఇసుక పనులు కల్పిస్తుందని ఆశిస్తున్నాను.

ముమ్మసాని ఏడుకొండలు, తాడువాయి, యజమాని

ఫ్లెక్సీలు తొలగించిన పోలీసులు

• సీఐ వాసుకు, డైమండ్‌బాబుకు మధ్య వాగ్వాదం

తాడికొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ వెన్నుపోటు దినోత్సవాన్ని బుధవారం చేపట్టింది. తాడికొండ ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా సభను ఏర్పాటు చేసిన వైసీపీ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫెక్సీలను ఏర్పాటు చేశారు. పెక్సీలు ఏర్పాటుకు పర్మిషన్లు లేకపోవటంతో సీఐ వాసు సిబ్బందితో తొలగించారు. దీంతో సీఐకు వైసీపీ నేత డైమండ్‌బాబుకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం సభా స్థలం నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు



స్వర్ణాంధ్ర-2047 చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మంగళగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులలో 36వ రోజైన బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. స్వర్ణాంధ్ర-2047 అంశంపై ఈ పోటీలు జరిగాయి. గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 6వ తేదీన బహుమతులను ప్రదానం చేస్తామని గ్రంథాలయాధికారి ఎన్ ఆరోగ్యం తెలియజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై తాడికొండ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన తోకల శివనాగరాజు తుళ్లూరు మండలం మందడంలో రేషన్ కార్డు దారుల వద్ద నుంచి పీడీఎస్ బియ్యాన్ని కిలో రూ. 15లకు కొనుగోలు చేసి ఓమ్ని వాహనంలో గుంటూరుకు తరలిస్తున్నాడు. పోలీసులకు సమాచారం రావటంతో తాడికొండలోని పెట్రోల్ బంక్‌వద్ద బియ్యం తరలిస్తున్న వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో 12 బస్తాల్లో 380 కిలోల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. సదరు వ్యక్తి రేషన్ బియ్యాన్ని రూ.20 చొప్పున హోటల్స్‌కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జోజి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడికొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన తాడికొండ మండలం ముక్కామల గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముక్కామల గ్రామానికి చెందిన దామనబోయిన వెంకటశివకృష్ణ(27) ఏప్రిల్ 30వ తేదీన మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. మద్యం మత్తులో ఉండగా ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. పురుగుల మందు తాగిన విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంళవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మామిడి పండ్లు కోశాడని ఇనుపరాడ్‌తో దాడి

తాడికొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మామిడి తోటలో పండ్లు కోశాడనే కోపంతో యువకుడిపై ఇనుపరాడ్‌తో దాడి చేసిన సంఘటన కంతేరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదకాకాని గ్రామానికి చెందిన షేక్ కరీముల్లా ఈ నెల 1వ తేదీన కంతేరులోని మామిడి తోటకు వెళ్లి కాయలు కోసాడు. ఇది గమనించిన తోట యజమాని కోపంతో ఇనుపరాడ్‌తో దాడి చేశాడు. గాయపడిన యువకుడు చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లాడు. చికిత్స అనంతరం బుధవారం తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఎవ్వర్నీ వదిలి పెట్టం

• బలసాని బెదిరింపులు

ప్రత్తిపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు వైసీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ఆ పార్టీ అధినేత జగన్ దారిలోనే బెదిరింపులకు దిగారు. ప్రత్తిపాడులో వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. ఇబ్బందులు పెట్టిన వారిని ఎవరికీ వదిలి పెట్టేది లేదంటూ హెచ్చరించారు.

బ్రహ్మేశ్వర స్వామి కల్యాణోత్సవం

వట్టిచెరుకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరులోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం బుధవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, గణనాధుని తొలి పూజతో స్థానిక పూజారి కృష్ణ స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామికి నీరాజనం, మంత్రపుష్ప కార్యక్రమాలు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం పుట్టమన్ను తేవటం, అకురారోహణ, నిత్యోపాసన, జీవ ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ పూజా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్వామి వారి ప్రతిష్ఠ రోజైన గురువారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించుకొనేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

కూటమి పాలనలో స్వర్ణాంధ్ర కల సాకారం

• ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు



మంగళగిరిలోని జనసేన కార్యాలయం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న నేతలు

మంగళగిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు భరోసా ఇచ్చే విధంగా కూటమి ప్రభుత్వ పాలనలో స్వర్ణాంధ్ర కల సాకారం కాబోతుందని, రాష్ట్రం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెందనుందని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్, మంగళగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు చెప్పారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపు మేరకు సుపరిపాలన మొదలై ఏడాది పేరిట బుధవారం మంగళగిరి బైపాస్ రోడ్డులోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద సంబరాలు నిర్వహించారు. జనసేన వీరమహిళలు రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా చిల్లపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, రాక్షస పాలన విరగడై ఏడాది పూర్తయిందన్నారు. గత ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు గాడి తప్పాయన్నారు. యువతను చెడు వ్యసనాలకు బానిసలుగా మార్చి సమాజానికి కీడు చేసే విధంగా తయారు చేసిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించే లక్ష్యంతో పనిచేస్తుందని, అప్పుల్లో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, నేతలు చవ్వాకుల కోటేష్‌బాబు, గంజి చిరంజీవి, పర్వతం మధుసూదనరావు, బేతపూడి విజయ్‌శేఖర్, బడే కోమలి, వాసా శ్రీనివాసరావు, సామల నాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, చిట్టెం అవినాష్, తిరుమలశెట్టి కొండలరావు, జొన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పీడ విరగడై ఏడాది

• ప్రత్తిపాడు సమన్వయకర్త కొర్రపాటి

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పట్టిన వైసీపీ పీడ విరగడై ఏడాది అయిందని జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు అన్నారు. కూటమి సుపరిపాలన మొదలై ఏడాది పూర్తి చేసుకుందన్నారు. బుధవారం నియోజకవర్గం 40వ డివిజన్ పెదపలకలూరులో రంగవల్లులు వేసి సుపరిపాలన వేడుకలు నియోజకవర్గ నాయకులు నాగినేని సునీల్ కుమార్ నిర్వహించారు. కొర్రపాటి మాట్లాడుతూ ఈ ఏడాదిలో కూటమి ప్రభుత్వం అనేక విజయాలను సాధించడంతో పాటు రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతికి నిధులతో పాటు అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను విడతల వారీగా సంవత్సర కాలంలోనే ప్రజలకి అందించామన్నారు. ఏడాది కాలంలో సంక్షేమ పథకాల వల్ల అట్టడుగు స్థాయి పేదలకు న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, జిల్లా కార్యదర్శి డేగల లక్ష్మణ్, 40 డివిజన్ అధ్యక్షుడు వీ మల్లికార్జునరావు, ఇతర నాయకులు అడపాల శివ నాగేశ్వరావు, కటారి వెంకటగిరి పాల్గొన్నారు.



పలకలూరులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కొర్రపాటి నాగేశ్వరరావు తదితర జనసేన నాయకులు

శిలాఫలకం సరే.. నిర్మాణం ఎప్పుడో..



పెదనందిపాడు బొడ్డురాయి సెంటర్లో సీసీ రోడ్డు నిర్మాణ శిలాఫలకం

పెదనందిపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల రూపురేఖలు మార్చే దిశగా అడుగులు వేస్తుంది. దీనిలో భాగంగా గ్రామీణ రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పెదనందిపాడు మండలంలో తొలి విడతగా 8 గ్రామాల్లో గతేడాది అక్టోబరులో రు.60లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఏడు గ్రామాల్లో చురుగ్గా పనులు చేపట్టి రహదారులు వినియోగంలోకి తీసుకువచ్చారు. పెదనందిపాడులో బొడ్డురాయి సెంటర్లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఏడు నెలలు గడిచినా కారణాలేవో తెలియనప్పటికీ నిర్మాణం చేపట్టకపోవడంపై ఆ ప్రాంత ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తుంటే ఇక్కడ మాత్రం ప్రజా ప్రతినిధుల సమన్వయ లోపమో, అధికారుల అలసత్వం కారణమో కానీ ఈ రహదారికి మోక్షం కలగడం లేదు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మాణం ప్రారంభించాలని కోరుతున్నారు.

ఎస్ఆర్ఎం ఫౌండేషన్ సేవలు అభినందనీయం

• తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా
• కురగల్లులో కంప్యూటర్, టైలరింగ్, ట్యూషన్ సెంటర్లు ప్రారంభం



కురగల్లులో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ సెంటర్లను ప్రారంభిస్తున్న తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా

మంగళగిరి సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చెన్నయ్‌లోని ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, వారికి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా కొనియాడారు. ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి మండలం కురగల్లులో బుధవారం ఉచిత కంప్యూటర్, టైలరింగ్, ట్యూషన్ సెంటర్లను ప్రారంభించారు. ట్యూషన్ చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంజనా మాట్లాడుతూ అమరావతిలో అతిపెద్ద విద్యా సంస్థగా ఎస్ఆర్ఎం వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తుందన్నారు. విద్యా సంస్థలు కూడా సామాజిక సేవకు ముందుకు వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా సేవలు అందించడం ముదావహమన్నారు. నేటి ఆధునిక జీవనంలో మహిళలకు డిజిటల్ అక్షరాస్యత అత్యంత ముఖ్యమన్నారు. ప్రతిఒక్కరూ కంప్యూటర్‌పై కనీస పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్ఆర్ఎం ప్రోవైస్ చాన్సలర్ ఆచార్య సతీశ్ కుమార్, ఎస్ఆర్ఎం ఫౌండేషన్ కార్యదర్శి డీవీ వెంకటగిరి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రామారావు, యూనివర్సిటీ అడిషనల్ రిజిస్ట్రార్ వినాయక, డైరెక్టర్లు అనూప్‌సింగ్, రేవతి బాలకృష్ణ, సిద్ధార్థ త్రిపాఠి, మీడియా మేనేజర్ గంగిశెట్టి వేణుగోపాల్, ట్యూషన్ సెంటర్ల టీచర్లు పాల్గొన్నారు.

చారిత్రాత్మక ప్రజాతీర్పుకు ఏడాది



అన్నక్యాంటీన్ వద్ద కేకు కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

దుగ్గిరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమికి తిరుగులేని విజయాన్ని అందించిన ప్రజాతీర్పు దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాల రైలుపేటలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద గల అన్నక్యాంటీన్ సమీపంలో టీడీపీ నాయకులు కేకు కట్‌చేసి వేడుక జరుపుకున్నారు. గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాసరావు, వల్లూరు నరసింహారావు తదితరులు కేకు కట్‌చేశారు. టపాసుల, బాణ సంచాలుపేల్చి ఘనంగా వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో దేవరపల్లి చంటి, పర్వతనేని హర్ష, వరదరాజు, పాటిబండ్ల సాయి, ఫిరోజ్, యేమినేని కోటేశ్వరరావు, బాషా, వెంకయ్య, జున్నూఖాన్, టైలర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పెదవడ్లపూడిలో ఎల్‌వోసీ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడికి చెందిన భార్యాభర్తలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను స్థానిక నేతలు బుధవారం బాధితుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సనం వెంకయ్య, రాజకుమారిలు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, వెంకయ్యకు రూ.లక్షా 50 వేలు, రాజకుమారికి రూ.లక్షా 25 వేలు మంజూరయ్యాయి. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో స్థానిక టీడీపీ నేతలు ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, మాదల రమేష్‌బాబు, గుడిమెట్ల మరియదాసు, ఎల్లయ్య, జాలాది సందీప్, శానం రఘు, కోటేశ్వరరావు, దీపు, డీకొల్లు పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్ తదితరులు

తాడేపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిర్రావూరు గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకులు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ బుధవారం విరాళం అందజేశారు. రూ.1,01,116లను విగ్రహ కమిటీ వారికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పిల్లి రమేష్, నాయకులు కూరపాటి సంపూర్ణరావు, మానేపల్లి కిరణ్, బూత్ కన్వీనర్ జెట్టి రవి, కొంకా మునలయ్య, మక్కపాటి ఏసుప్రసాద్ పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ



మహిళకు తోపుడు బండిని అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో ఇద్దరు చిరువ్యాపారులకు తోపుడు బండ్లు, శ్రామికుడికి ఫ్లాట్‌ఫారం రిక్షా పంపిణీ చేశారు. మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి చెందిన కట్టెపోగు లక్ష్మయ్య, తాడేపల్లి పట్టణం 3వ వార్డుకు చెందిన ఉయ్యాల కోటేశ్వరి తమకు తోపుడు బండ్లు కావాలని, నిడమర్రు గ్రామానికి చెందిన తాడిశెట్టి రామస్వామి తనకు ఫ్లాట్‌ఫారం రిక్షా అందించాలని మంత్రి లోకేశ్‌కు విన్నవించుకున్నారు. స్పందించిన ఆయన బుధవారం స్థానిక నేతల ద్వారా తోపుడు బండ్లు, ఫ్లాట్‌ఫారం రిక్షా అందజేయించారు. లబ్ధిదారులు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, నేతలు మల్లవరపు వెంకట్, షేక్ చాంద్ బాషా, వనమా సుధాకర్, తోట రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

• గింజుపల్లి వెంకటేశ్వరరావు



కేక్ కట్ చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ప్రత్తిపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం సంవత్సర కాలంలోనే ప్రజా రంజక పాలన అందించిన సీఎం చంద్రబాబునాయుడు అని రాష్ట్ర తెలుగురైతు మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రత్తిపాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, కాసు పెంటారెడ్డి, డక్కుమళ్ల భాగ్యారావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, చిన్నం శ్రీకాంత్, సాదినేని వీరయ్య, పీ సాంబశివరావు, మాకినేని జగన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగివుండాలి



సదస్సులో మాట్లాడుతున్న బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మౌనిక

తాడేపల్లి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగివుండి, మోసపోకుండా ఉండాలనేదే భారతీయ రిజర్వు బ్యాంకు ముఖ్య ఉద్దేశమని ఏపీ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సీహెచ్ మౌనిక అన్నారు. స్థానిక తాడేపల్లి మున్సిపల్ మీటింగ్ హాల్లో బుధవారం రిజర్వు బ్యాంక్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ (ఖాతాదారుల చైతన్య అవగాహనా సదస్సు)పై ఒకరోజు వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మౌనిక మాట్లాడుతూ అందరూ తమ బ్యాంకులో పరపతిని పెంచుకోవాలని, సంపాదనలో ఇరవై శాతం తప్పకుండా పొదుపు చేయడం నేర్చుకోవాలని అన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు ఆర్థిక క్రమశిక్షణ కలిగి లక్షాధికారి కావాలని, ప్రభుత్వ బ్యాంకులో మాత్రమే మీ డబ్బుకు భద్రత ఉంటుందని, ప్రైవేటు వడ్డీల జోలికి వెళ్లకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్పీ అధ్యక్షురాలు రాణి, విజయకుమారి, రమాదేవి, దుర్గ వివిధ సంఘాల ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్



నాగులపాడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

పెదనందిపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్ అని టీడీపీ గ్రామ అధ్యక్షుడు బండి నాగబాబు అన్నారు. మండల పరిధిలోని నాగులపాడు టీడీపీ కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా బుధవారం సంబరాలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష నేత ప్రజల తీర్పును తప్పుబడుతూ వెన్నుపోటు దినంగా కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, తెలుగుయువత నాయకులు బండి కిరణ్‌కుమార్, ఆళ్ళ ఫణిబాబు, సందిరెడ్డి ఉమా, కమ్మ సురేష్, పాటిబండ్ల నాగరాజు, నార్ల వెంకటేశ్వర్లు, ముత్తవరపు నాగేశ్వరరావు, నీటి సంఘ ఉపాధ్యక్షుడు ఆళ్ల నాగేశ్వరరావు, బండి జయచంద్రశేఖర్, ఆళ్ల రామారావు, కొమ్మినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టులో ప్లంజ్ పూల్ రక్షణకు చర్యలు చేపడుతున్నాం

• పాలడుగు వాసికి వివరాలు పంపిన ప్రాజెక్ట్ అధికారి

మేడికొండూరు జూన్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టులో ప్లంజ్ పూల్ రక్షణకు చర్యలు చేపడుతున్నామని ఆనకట్ట నిర్వహణ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన కంతేటి నాగేశ్వరరావు శ్రీశైలం ప్రాజెక్టులో ఏర్పడిన ప్లంజ్ పూల్ గురించి ఎటువంటి చర్యలు చేపట్టారో తెలియజేయాలంటూ గత నెల 19వ తేదీన జరిగిన ప్రజావేదికలో కోరారు. దీనిపై బుధవారం శ్రీశైలం ప్రాజెక్టు అధికారులు వివరణ పంపారు. శ్రీశైలం డ్యాం వద్ద స్పిల్ వే దిగువన ఉన్న ప్లంజ్ పూల్ డ్యామ్ గేట్లు నుంచి విడుదలైన నీటి ఒత్తిడి కారణంగా అపారమైన శక్తి వెదజల్లడం వల్ల ఏర్పడిందని, దాని లోతు ప్రస్తుతానికి రమారమి 150 అడుగులుగా ఉందని పేర్కొన్నారు. అయితే 2009 నాటి ఘటన పునరావృతం కాకుండా పై ప్రాంతాల నుంచి వచ్చే వరదలను, నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తామని వివరించారు. అంతేకాకుండా కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ ఏబీ పాండ్యా ప్రస్తుత చైర్మన్ అనిల్ జైన్ తదితరుల ఆధ్వర్యంలో డ్యాం సేఫ్టీ రివ్యూ పానెల్ బృందం శ్రీశైలం డ్యామ్‌ని పరిశీలించారని, వారి సూచనల మేరకు శ్రీశైలం జలాశయ భద్రతకు సంబంధించిన విషయాలపై సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో పరీక్షలు, పరిశీలనలు, అధ్యయనాలు జరుగుతున్నాయన్నారు. అధ్యయన నివేదికలకు అనుగుణంగా ప్లంజ్ పూల్ రక్షణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు అధ్యయనాలు చేపట్టడానికి వీలుగా 14.70 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఆనకట్ట కుడివైపు నుంచి ఎప్రాన్ వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం మరో 25 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభించడానికి టెండర్లను పిలిచామని, అనంతరం పనులు చేపట్టడం జరుగుతుందని వివరించారు.

శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్పయాగం



దుగ్గిరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైలుపేటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్పయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. 23రకాల పుష్పాలతో స్వామికి వేదపండితుల పర్యవేక్షణలో జరిగిన పుష్పయాగాన్ని తిలకించేందుకు భక్తులు దుగ్గిరాల గ్రామపరిసరాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు సాకేత్, రామచంద్రలు వేదపండితుల పర్యవేక్షణలో కొంగర జోగేంద్రప్రసాద్, నాగరాజకుమారి, శరత్‌చంద్ర, సుజాత, జ్యోత్స్న, నాగేంద్రప్రసాద్ దంపతులు, ఇతర కుటుంబసభ్యులతో పుష్పార్చన జరిపించారు. పుష్పయాగాన్ని నిర్వహించిన జోగేంద్రప్రసాద్ దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం అందించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో పుష్పయాగాన్ని వీక్షించిన భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. సుమారు 2వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

కాకుమానులో కూటమి నేతల సంబరాలు



పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కాకుమాను, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కాకుమాను తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయంలో బుధవారం విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మామిళ్లపల్లి రాంగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో మాజీ అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి భారీ కేక్ కట్ చేసి టీడీపీ శ్రేణులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన మొదలై ఏడాది, పీడా వీరగడై ఏడాది అని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లమోతు పూర్ణచంద్రరావు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్, రత్నబాబు, ప్యారీజాన్, తదితరులు పాల్గొన్నారు.

ముట్లూరులో జనసేన విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

వట్టిచెరుకూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపుతో రాష్ట్రంలో పీడ విరగడై అభివృద్ధి పాలన మొదలైన సందర్భంగా బుధవారం రాత్రి మండలంలోని ముట్లూరులో బాణ సంచాలు కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. అరాచక పాలన పోయి అభివృద్ధి పాలన రావటానికి సహకరించిన ఎన్‌డీఏ కూటమి భాగస్వామ్య పార్టీ నాయకులకు జన సైనికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పత్తి పాపారావు, బీరం శ్రీనివాసరావు, అల్లం చిన్న సుబ్బారావు, పిచ్చయ్య, అల్లం రామయ్య, జీ వెంకట్, మాజీ ఎంపీటీసీలు రాంబాబు, తంబి, రవి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. బుధవారం అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు మోదుగ హేమంత్, వర్ధన్‌ల జన్మదినోత్సవం సందర్భంగా వారి మేనత్తలు, మామ తల్లిదండ్రులు సుజాత, శ్రీనివాస్, రవి, అనూరాధ, శైలజ, రమాదేవి కుటుంబ సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగ, తాగునీరును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కె.శీనివాసరావు, ప్రతాప్, వాసు, ప్రదీప్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రజాపాలన ప్రారంభమై ఏడాది

కూటమి పార్టీల ఆధ్వర్యంలో సంబరాలు



ఐలాండ్ సెంటర్లో ప్రదర్శన నిర్వహిస్తున్న కూటమి పార్టీల నాయకులు

పొన్నూరు టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాతీర్పు వెలువడి వైసీపీ అరాచకపాలనకు చరమగీతం పాడి ఏడాది అవుతోందని జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త వడ్రానం మార్కండేయబాబు అన్నారు. బుధవారం కూటమి పార్టీల ఆధ్వర్యంలో ప్రజాపాలన ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా పట్టణంలో సంబరాలు నిర్వహించారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో కూటమి పార్టీల నాయకులు మూడు పార్టీల జెండాలను చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. జనసేన వీరమహిళలు సాక్షి భావనారాయణ స్వామి ఆలయంలో మూడు పార్టీల పతకాలను ప్రతిబింబించే విధంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. జనసేన కార్యాలయం ముందు బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్రాణం మార్కండేయబాబు మాట్లాడుతూ ప్రజాతీర్పుతో సైకోపాలనపోయి సంక్షేమ పాలన ఆరంభమైందన్నారు. ఏడాది కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ధ్వసమైన రోడ్ల నిర్మాణం, మౌళిక వసతుల కల్పన, అన్న క్యాంటిన్ల ప్రారంభం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. పొన్నూరులో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో అరాచకాలకు ముగింపు పలికి పొన్నూరును ప్రగతిపథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.రానున్న రోజుల్లో మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల సాంబశివరావు, మాదాల వెంకటేశ్వరరావు, అహ్మద్‌ఖాన్, బాజీసాహెబ్, బండ్లమూడి బాబురావు, చల్లంశెట్టి సీతారామయ్య, సంగండెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు, జనసేన నాయకులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు

ఘనంగా సుపరిపాలన వార్షికోత్సవం

తెనాలి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకపాలనను అంతమై కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభించి ఏడాది పూర్తైన సందర్భంగా పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముత్యాల ముగ్గులువేసి రంగురంగుల పూలు జల్లి మధ్యలో దీపాలను వెలిగించి బాణసంచా కాల్చి సుపరిపాలన సంబరాలు జరిపారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోయి సుపరిపాలన వచ్చిన రోజని ఇది రాష్ట్ర ప్రజలందరికి పండుగ దినమని పార్టీ నాయకులు, వీరమహిళలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న పార్టీ శ్రేణులు

రాయితీపై రైతులకు వ్యవసాయ డ్రోన్లు

● ఎమ్మెల్యే నరేంద్ర కుమార్



వ్యవసాయ డ్రోన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో బుధవారం పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ రైతులకు వ్యవసాయ డ్రోన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ రైతులకు కావాల్సిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే పరికరాలను సబ్సిడీపై అందిస్తుందని ఈరోజు ఉప్పలపాడు గ్రామంలో డ్రోన్లు పంపిణీ చేయడం జరిగిందని వీటితో పురుగు మందుల వాడకం తేలికవుతుందని రైతుకు వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయన్నారు.అనమర్లపూడి, నంబూరు గ్రామాల్లో కూడా కిసాన్ డ్రోన్లు పంపిణీ చేశామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సంధ్యారాణి, మండల పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, సర్పంచ్ కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ భూషబాబు రైతులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా వెన్నుపోటు

● మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ శ్రేణులు

తెనాలి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వెన్నుపోటు పొడిచారంటూ మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విమర్శించారు. వైసీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని మునిసిపల్ మార్కెట్ పురవేదిక వద్ద నుంచి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ఆధ్వర్యంలో గాంధీచౌక్ మీదుగా టౌన్ చర్చి రోడ్డుగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, దేసు శ్రీనివాసరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కె.వెంకటప్పరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, జొన్నల శివారెడ్డి, బి.పోతురాజు, గంగాధర్, బుజ్జిబాబు, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, నాగవేణి, నాంచారమ్మ, యశోద పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరుటౌన్ జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పార్టీకి ఓట్లువేసి మరోసారి గెలిపించకపోతే ప్రజలందరూ గాలికి కొట్టుకుపోతారని పొన్నూరు వైసీపీ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ దూషించారు. వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా వెన్నుపోటు దినోత్సవాన్ని బుధవారం పొన్నూరులో వైసీపీ నిర్వహించింది. వైసీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో వైసీపీ ఇన్‌చార్జి అంబటి మురళీ మాట్లాడుతూ బూటకపు హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. టీడీపీకి ఓట్లు వేసిన ప్రజలను, అలాగే పోలీసులను కూడా బెదిరించే రీతిలో దొంగ కేసులు పెట్టవద్దంటూ హెచ్చరించారు. వెన్నుపోటు దినోత్సవం పేరుతో కార్యక్రమం నిర్వహించి ప్రజలను శాపనార్థాలు పెట్టే విధంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి.



వెన్నుపోటు దినం ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకుడు అంబటి మురళీకృష్ణ, తదితరులు

రౌడీలకు మాజీ సీఎం అండ దారుణం

● మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఎదుట వాపోయిన కానిస్టేబుల్ భార్య



మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ ఎదుట విలపిస్తున్న కానిస్టేబుల్ చిరంజీవి భార్య కల్యాణి

తెనాలి రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రౌడీలకు మాజీ సీఎం అండగా ఉండటం దారుణమని మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ ఎదుట కానిస్టేబుల్ చిరంజీవి భార్య కల్యాణి వాపోయింది. బుధవారం తెనాలి విచ్చేసిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారితో కలిసి పట్టణంలోని ఐతానగర్‌లో కానిస్టేబుల్ చిరంజీవి ఇంటికి వెళ్లి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం కల్యాణి మాట్లాడుతూ నా భర్త కానిస్టేబుల్ చిరంజీవిపై రౌడీలు దాడి చేసినప్పుడు కూడా కొంత ధైర్యంగానే ఉన్నాను. విధి నిర్వహణలో ఉన్న నాభర్తకు అందరు అండగా నిలుస్తారని ఆశపడ్డాను. కాని కులం, రాజకీయ రంగుపూసి రౌడీషీటర్లకు అండగా సాక్షాత్తు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డె వస్తారని ఊహించేలదు. ఈ ఘటన జరిగిన తరువాత నాభర్తకు, నాకుటుంబానికి ప్రాణహాని ఉంది. ఏ క్షణాన ఏంజరుగుతుందోనని భయమేస్తుందమ్మా.. నా భర్తను మరో ప్రాంతానికి బదిలీ చేయించండి అంటూ కన్నీరు మున్నీరుగా విలపిస్తూ కానిస్టేబుల్ భార్య కల్యాణి మహిళా చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజను వేడుకున్నారు. కల్యాణి మాట్లాడుతూ తనకు తల్లిదండ్రులు లేకపోయినా కులం వేరయినా చిరంజీవి తనను పెళ్లి చేసుకుని బాగా చూసుకుంటున్నాడని తెలిపింది. తనభర్తపై జరిగిన దాడిని పోలీసులకు ఫిర్యాదు చేశానని పోలీస్‌గా ఉన్న వ్యక్తికే రక్షణలేకపోతే సమాజంలో సామాన్యుల పరిస్థితి ఎంటని ఆ నాడు ఉన్నతాధికారులను ప్రశ్నించానని తెలిపారు. ఐతాగనర్‌లో గత కొన్నేళ్లుగా అనేక నేరాలు జరిగాయని కనీసం చెప్పుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. తన భర్త చేయని తప్పుకు రౌడీలు దారికాసి దాడిచేస్తే ఘటనను ఖండించి తమకు అండగా నిలవాల్సిన్న కొందరు కులసంఘాల నాయకులు, కొన్ని రాజకీయ పార్టీలు అందుకు విరుద్ధంగా దాడికి పాల్పడిన వారికి అండగా నిలవడం చూస్తే భయంగా ఉందని చెప్పారు. సాక్షాత్తు మాజీ ముఖ్యమంత్రి జగన్ రౌడీషీటర్లను పరామర్శించేందుకు తెనాలి వచ్చారంటే ఇంతకన్నా దారుణం ఇంకొకటి ఉందన్నారు. దాడిలో గాయపడిని తన కుటుంబాన్ని ఓదార్చేందుకు ఏ ఒక్కరూ రాకపోగా ఘటనకు పాల్పడిన వారికి భరోసా కల్పించేందుకు సాక్షాత్తు వైసీపీ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి రావడం భయాందోళనకు గురిచేసిందన్నారు. ఐసీడీఎస్ అధికారులు పలువురు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేడు వన మహోత్సవానికి పటిష్ట బందోబస్తు

● ఏర్పాట్లు పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : నేడు రాజధానిలో జరగనున్న వన మహోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అయా ఏర్పాట్లను పరిశీలించారు. గుంటూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా అభ్యాస కార్యక్రమంలో పాల్గొని పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ యోగా వలన శారీరక దృఢత్వం, మానసిక స్థిరత్వం, ఆలోచనా సామర్థ్యం మెరుగుపడతాయన్నారు. యోగా, ధ్యానం అనేవి శారీరకంగా, మానసికంగా మనిషి స్థితిగతులను మార్చగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయన్నారు. యోగా, ధ్యానం అభ్యాసం వలన మనిషి ఆలోచనా విధానం, సామర్థ్యం మెరుగుపడతాయన్నారు. మానసిక స్థిరత్వం, ప్రశాంతత అలవడతాయ న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ.హనుమంతు, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి ఆర్ఐ శ్రీహరి రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఎంఈవో కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ భోజన పథక నిర్వాహకులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై రాజకీయ వేధింపులను ఆపాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు, వంట బిల్లులు తక్షణమే చెల్లించాలని, ఏజెన్సీ నిర్వాహకులకు ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుమతి, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

● డీఆర్‌డీఏ ఏపీవో వెంకయ్య

కొల్లిపర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పేద ప్రజలకు ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ ఏపీవో వెంకయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, దంతలూరు, అత్తోట తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని పేదప్రజలు సద్వినియోగించు కోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించినట్లు తెలియజేశారు. కూలీలకు కొలతలు బట్టి వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వల్లభాపురం బుజ్జిబాబు, కనపర్తి సాగర్, వి.రాజేంద్ర, కోటేశ్వరరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ భార్గవ్

స్వచ్ఛ సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● ఈవోపీఆర్డీ భార్గవ్

కొల్లిపర, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈవోపీఆర్డీ భార్గవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చివలూరు, కొల్లిపర పంచాయతీ పరిధిలో ఉన్న స్వచ్ఛ సంపద తయారీ కేంద్రాలను ఆయన తనిఖీ నిర్వహించారు. పంచాయతీ సిబ్బందికి స్వచ్ఛ సంపద తయారీపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ స్వచ్ఛ సంపద ప్రధాన్యంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల వలన ప్రజలకు అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామాల్లో పారిశుధ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. రోడ్లపక్కన చెత్తచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. కాల్వల్లో మురుగునీరు తొలగింపుపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆలకనంద, మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తున్న మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలి

● ఎంఈవో చలపతిరావు

పొన్నూరు టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజన పథ కంను ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలతో అం దించాలని మండల విద్యాశాఖాధికారి ఆర్ చలపతిరావు అన్నారు. ఎంఈవో కార్యాలయంలో బుధవారం డొక్కా సీత మ్మ మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు శిక్షణ తరగతులు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకంలో రూ పొందించే వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలు, వాటి తయారీ, ఆహారంతో అందే పోషక విలువల గురించి అవగాహన కల్పించారు. వంటచేసే మహిళలకు పోటీలను నిర్వహించి ఉత్తమ ఆహార పదార్థాలు తయారుచేసిన మహిళలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నోడల్ ప్రధానోపాధ్యాయుడు వైఎస్‌టీ సాయి, రిసోర్స్‌పర్సన్ సుజాత, ఎంఈవో-2 కొల్లి విజయభాస్కర్‌రావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గుంటూరులో సీపీడీసీ సీఎండీ పుల్లారెడ్డి పర్యటన

గుంటూరు, జూన్4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ నూతన సీఎండీగా బాధ్యతలు చేపట్టిన పుల్లారెడ్డి నేడు గుంటూరు రానున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అస్తవ్యస్త విధానాలతో పాటు రెవెన్యూ పరమైన అంశాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్‌తో కలిసి సీఎండీ పుల్లారావు సోమవారం బాపట్ల సర్కిల్‌ను సందర్శించారు. అధికారులతో సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ నెల 5న జిల్లా కేంద్రం గుంటూరు సర్కిల్ విద్యుత్‌భవన్‌ను కూడా సందర్శించనున్నట్లు ఇప్పటికే అధికారులకు సమాచారం అందింది. సర్కిల్ పరిధిలోని గుంటూరు, తెనాలి డివిజన్ వారీగా ఆయన సమీక్షించనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.



సమావేశంలో మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి


సూక్ష్మ, చిన్న, పరిశ్రమల ఏర్పాటుకు

ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది

● జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి

పొన్నూరు టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏ జయలక్ష్మి అన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా 90మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వర్క్‌షాపునకు హాజరయ్యారు. జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలకు కేంద్ర ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తోందన్నారు. పరిశ్రమలు పెట్టాలనుకున్నవారు ప్రాజెక్టు రిపోర్టుతో హాజరయితే పరిశ్రమల ఏర్పాటుకు మంజూరు చేసే రుణాలలో 35శాతం వరకు రాయితీలను అందించనున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికి ప్రారిశ్రామికవేత్తను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఔత్సాహికులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశం పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ మణికుమార్, శ్రీనివాసరావు, ఎంపీడీవో చంద్రశేఖరరావు, ఏపీఎం జోయబాబు, తదితరులు పాల్గొన్నారు. పరిశ్రమలు స్థాపించాలనుకునే వారు ఇతర వివరాలకు 9966549759ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు నగదు బహుమతులు పంపిణీ



ఉపకార వేతనాలు అందజేస్తున్న మాజీ చైర్‌పర్సన్ ఖలేదానసీమ్

తెనాలి అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గంగానమ్మపేటలోని టీఎస్‌రావు హైస్కూల్‌లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం రూ.51వేలు నగదు బహుమతులు పంపిణీ చేశారు. దాత శివారెడ్డి సహకారంతో ప్రతిభచూపిన పేద విద్యార్థులు మొదటి బహుమతి కింద రూ.15వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.5వేలు, 500మార్కులు దాటిన మరో ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, డాక్టర్ జీవనలత, ఎంఈవో జయంత్‌బాబు, హెచ్‌ఎం ప్రసన్నత్, అర్బన్ బ్యాంకు చైర్మన్ మంగమూరి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

శానిటేషన్‌ను మెరుగుపర్చండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శానిటేషన్ పనులను మెరుగుపర్చాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక గంగానమ్మపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి మురుగు కాలువల్లో వ్యర్థాలను తొలగిస్తున్నామన్నారు. అనంతరం రామలింగేశ్వరపేటలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇనుప బారికేడ్లను అందజేస్తున్న దాతలు

పెదకాకాని మల్లన్న ఆలయానికి

రూ.లక్ష విలువైన బారికేడ్లు వితరణ

పెదకాకాని, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలోని క్యూ లైన్లుగా వినియోగించుటకు బారికేడ్లను భక్తులు విరాళంగా అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల మండలం, గనిఆత్కూరు గ్రామానికి చెందిన పాములపాటి రవిమణికంఠ, సునయన దంపతులు, వారి కుమారుడు పాములపాటి హేమాన్ష్ జింకు పైపులతో చేసిన లక్ష రూపాయలు విలువ చేసే 25 బారిగేట్లు దేవస్థానం ఉప కమిషనర్ జి లీలా కుమార్‌కు బుధవారం ఆలయ ప్రాంగణంలో అందజేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

9న జిల్లా స్థాయి చదరంగం పోటీలు

గుంటూరు (తూర్పు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఇంటాక్ గుంటూరు జిల్లా చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక భారతీయ విద్యా భవన్‌లో ఈ నెల 9న అండర్-15 బాల బాలికలకు విభాగంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్టు భారతీయ విద్యాభవన్, గుంటూరు కేంద్ర కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. విద్యాభవన్లో బుధవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆనంద్ చెస్ అకాడమీ నిర్వాహకుడు గోపి మాట్లాడుతూ ఆసక్తి గలిగిన క్రీడాకారులు తమ దరఖాస్తులను 8వ తేదీలోపు భారతీయ విద్యా భవన్‌లో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 97030 49378, 91245 19444 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్, చాప్టర్ కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.